## తెలంగాణకు తేలికపాటి వర్షాలు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాగల 24గంటల్లో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశాలు ఉన్నట్టు తెలిపింది. గడిచిన 24గంటల్లో అక్కడక్కడా ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లాలోని శామీర్‌పేట మండలం అలియాబాద్‌లో 2.5 మి.మీ., నాగర్‌కర్నూలు జిల్లాలోని వట్‌వర్లపల్లిలో 2.3 మి.మీ వర్షం కురిసింది.

RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 32 | మంగళవారం, ఫిబ్రవరి 27, 2024 | పేజీలు : 4

### గజల్ గాయకుడు పంకజ్ ఉధాస్...

## కన్నుమూత



ప్రముఖ గజల్ గాయకుడు పంకజ్ ఉధాస్ కన్నుమూశారు. కొంతకాలంగా అస్వస్థతతో బాధపడుతున్న ఆయన సోమవారం మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన వయసు 72 ఏళ్లు. పంకజ్ ఉధాస్ 1951 లో సౌరాష్ట్రలోని జట్పూర్ లో జన్మించారు. ముంబయిలో ఆయన విద్యాభ్యాసం సాగింది. తండ్రినుంచి దిల్రుబా అనే వాద్య పరికరం వాయించడం నేర్చుకునే క్రమంలో పంకజ్ కు సంగీతంపై ఆసక్తి కలిగింది. రాజ్ కోట్ లోని సంగీత్ అకాడమీలో చేరి, తబలా వాద్యం నేర్చుకున్నారు. ఆ తర్వాత గులాం ఖాదిర్ ఖాన్ సాహెబ్ వద్ద హిందుస్తానీ సంగీతం నేర్చుకున్నారు. గజల్ గాయకుడిగా సంగీత ప్రపంచాన్ని ఓలలాడించిన పంకజ్ ఉధాస్, పలు బాలీవుడ్ పాటలకూ గాత్రదానం చేశారు. చిఠ్ఠీ ఆయీహై (నామ్), జియే తో జియే కైసే (సాజన్), ఆజ్ ఫిర్ తుమె పే ప్యార్ ఆయా హై (దయావన్), ఛుపానే భీ నహీ ఆతా (బాజీగర్) వంటి పాటలు ఆయన గళంలోంచి వెలువడినవే.

### మంత్రి దామోదర్ రాజనర్సింహతో ఆస్ట్రేలియా హెల్త్ మినిస్టర్ అంబర్

## జెడ్ సండర్సన్ భేటీ




**హైదరాబాద్ ఫిబ్రవరి, 26 :** రాష్ట్రంలో డాక్టర్ కాళోజి నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ద్వారా నాణ్యమైన వైద్య విద్యను అందిస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి దామోదర రాజనర్సింహతో గవర్నమెంట్ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియా హెల్త్ మినిస్టర్ అంబర్ జెడ్ సండర్సన్, గవర్నమెంట్ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియా డిపార్ట్మెంట్ ఆఫ్ హెల్త్‌కు చెందిన ఉన్నత స్థాయి అధికారుల బృందం నగరంలోని ట్రైడెంట్ హోటల్‌లో సమావేశమయ్యారు. గవర్నమెంట్ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియాలో మెడికల్, పారామెడికల్ హెల్త్ కేర్ రంగాలలో ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహతో చర్చించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏటా 8,515 మెడికల్ గ్రాడ్యుయేట్స్, 6,880 మంది నర్సింగ్ గ్రాడ్యుయేట్స్‌లతో పాటు 22,970 మంది పారా మెడికల్ కోర్సులను విజయవంతంగా పూర్తి చేస్తున్నారని వెల్లడించారు. హైదరాబాద్ నగరం మెడికల్ వ్యాల్యూ టూరిజం డెస్టినేషన్‌గా ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో టామ్‌కామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్) ద్వారా నర్సింగ్, పారామెడికల్ కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రొఫెషనల్స్‌గా శిక్షణ ఇచ్చి వారు ప్రపంచంలో ఎక్కడైనా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందడానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. రాష్ట్రానికి చెందిన మెడికల్, పారా మెడికల్ కోర్సులు పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవడానికి గవర్నమెంట్ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియాతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు.

## నేనేం తప్పు చేశాను...

### నన్ను ఎందుకు పక్కన పెట్టారు? : విహెచ్

హైదరాబాద్ : నేనేం తప్పు చేశాను. నన్ను ఎందుకు పక్కన పెట్టారని కాంగ్రెస్ సీనియర్ నేత విహెచ్ హనుమంతరావు ప్రశ్నించారు. ఎంపిగా పోటీ చేసి తీరుతానని, తన మనసులో మాట చెప్పారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఖమ్మంలో ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్నానని, ఖమ్మం ప్రజలపై జరిగిన ప్రతి అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటం చేశానని స్పష్టం చేశారు. ఖమ్మం నుంచి పోటీ చేయాలని అక్కడి క్యాడర్ తనను అడుగుతున్నారన్నారు. పార్టీ కోసం తన కంటే ఎక్కువ కష్టపడిన వాళ్ళు ఉన్నారా? అని ప్రశ్నించారు.

## పదేండ్లలో వందేళ్ల విధ్వంసం

### - సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ ఫిబ్రవరి, 26 :** గత బిఆర్ఎస్ సర్కార్.. పదేండ్లలో వందేళ్ల విధ్వంసం చేసిందని ఫైర్ అయ్యారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. సింగరేణి కార్మికులు ఉద్యమంలో కీలకంగా ఉన్నారని.. వారికి ప్రమాద బీమాను కోటి రూపాయలకు పెంచుతున్నట్లు వెల్లడించారు. బ్యాంకులతో ఎంఓయూ చేసుకున్నామని తెలిపారు. గత పాలకులు సింగరేణిని ప్రవేటు పరం చేసే కుట్ర చేశారని ఆరోపించారు. సోమవారం సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. "మనం బ్యాంకులకు కట్టాల్సిన అప్పే రూ.70వేల కోట్లు ఉంది. మిగలు రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టారు. ధనదాహానికి బలైన ప్రాజెక్టులను ఏం చేయాలో అర్థం కావడంలేదు. కుంగిన మేడిగడ్డను ఎలా బాగు చేయాలో సలహా ఇవ్వరు. పదేండ్ల బిఆర్ఎస్ పాలనపై అసెంబ్లీలో ప్రత్యేక సమావేశాలు పెడ్తాం.. చర్చించేందుకు బిఆర్ఎస్ నేతలు సిద్ధమా?. గత ప్రభుత్వ తప్పిదాలను ప్రజలకు వివరిస్తున్నాం. ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. బిఆర్ఎస్, బిజెపి కలిసి కాంగ్రెస్ పై దాడి చేస్తున్నాయి. స్వార్థం కోసం బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు కలిసి పనిచేస్తున్నాయి. తెలంగాణను ఆంధ్రావాళ్ల కంటే ఎక్కువ విధ్వంసం చేసిన ఘనత కెసిఆర్ దే. ఇంకా బిఆర్ఎస్ నేతలు అబద్దాలు చెప్పి.. ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారు.

### సమాజంపై...

## నా లక్ష్యం వేరు

### భారత్ టెక్స్ సదస్సులో మోడీ





న్యూఢిల్లీ : ఎటువంటి సమాజం ఉండాలో ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం విస్పష్టంగా ప్రకటించారు. ప్రభుత్వ జోక్యం కనీస మాత్రంగా ఉండే సమాజం సృష్టి తన లక్ష్మమని ప్రధాని వెల్లడించారు. అది ప్రజల సౌభాగ్యానికి దోహదకారి అవుతుందని మోడీ సూచించారు. పేదల కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ ఉండాలని ప్రధాని అన్నారు. 'ప్రభుత్వ జోక్యం కనీస మాత్రంగా ఉండే సమాజాన్ని మనం సృష్టించవలసి ఉంటుంది & ముఖ్యంగా మధ్య తరగతి జీవితాలలో జోక్యాన్ని నేను ఇష్టపడను' అని మోడీ చెప్పారు. ఢిల్లీలో 'భారత్ టెక్స్ 2024' సదస్సులో ప్రధాని మోడీ ప్రసంగిస్తూ, కనీస మాత్రపు ప్రభుత్వ జోక్యంతో సమాజం సృష్టికి గడచిన పది సంవత్సరాలుగా తాను పోరాడుతున్నానని, వచ్చే ఐదు సంవత్సరాలలో అదే విధంగా చేస్తుంటానని తెలిపారు. దేశంలో సౌభాగ్య కోసం ప్రభుత్వం దోహదపడే ఏజెంట్‌గా వ్యవహరించాలని ఆయన నొక్కిచెప్పారు. ఇతరుల జీవితాలలో జోక్యం చేసుకోవడమనే ప్రభుత్వ అలవాటును తప్పించడానికి గత పది సంవత్సరాలుగా తాను పోరాడుతున్నానని, 'రానున్న ఐదు సంవత్సరాలలో కచ్చితంగా అదే పని చేస్తాను' అని ఆయన చెప్పారు. దేశంలో అతి పెద్ద ప్రపంచ జౌళి సదస్సులలో ఒకటి భారత్ టెక్స్ 2024.

### అధికారంలోకి వస్తే...

## అగ్నిపథ్ రద్దు చేస్తాం


### : మల్లికార్జున్ ఖర్గే



న్యూఢిల్లీ : 'అగ్నిపథ్' సైనిక రిక్రూట్‌మెంట్ పథకం విషయమై కేంద్ర ప్రభుత్వంపై తన విమర్శల దాడిని కాంగ్రెస్ సోమవారం మరింత ఉద్ధృతం చేసింది. యువజనులకు 'పూర్తి అన్యాయం' జరుగుతోందని పార్టీ ఆరోపించింది. తాము కేంద్రంలో అధికారంలోకి వచ్చినట్లయితే పాత రిక్రూట్‌మెంట్ విధానాన్ని తిరిగి తెస్తామని కాంగ్రెస్ స్పష్టం చేసింది. 'అగ్నిపథ్' పథకాన్ని 2022లో ప్రారంభించగా, రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో నెగ్గిన దాదాపు రెండు లక్షల మంది యువజనులకు నియామక పత్రాలు జారీ చేయాలని కాంగ్రెస్ కోరింది. 'అగ్నిపథ్' పథకం కారణంగా సాయుధ బలగాలలో రెగ్యులర్ ఉద్యోగాలు కోరుతున్న యువజనులకు 'ఎంతో అన్యాయం' జరిగిందని ఖర్గే రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఒక లేఖలో తెలియజేశారు. వారికి న్యాయం చేకూర్చాలని ముర్ముకు ఖర్గే విజ్ఞప్తి చేశారు.

### ఏడోసారి ఇడి విచారణకు...

## కేజ్రీవాల్ డుమ్మా



న్యూఢిల్లీ: దేశరాజధాని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ మరోసారి ఇడి విచారణకు డుమ్మా కొట్టారు. ఫిబ్రవరి 26వ తేదీ సోమవారం ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో విచారణకు హాజరుకావాలని కేజ్రీవాల్ కు ఇటీవల ఇడి ఏడోసారి నోటీసులు పంపింది. అయితే, కేజ్రీవాల్ విచారణకు హాజరు కావడంలేదని ఆప్ పార్టీ స్పష్టం చేసింది. ఇడి అంశం కోర్టు పరిధిలో ఉందని... రౌజ్ అవెన్యూ కోర్టులో మార్చి 16న విచారణ ఉందని ఆప్ నేతలు తెలిపారు. రాజకీయ కక్ష్యంతోనే కేంద్రం.. ఇడిని అడ్డం పెట్టుకుని వేధింపులకు పాల్పడుతుందని.. కేజ్రీవాల్ ను అరెస్టు చేసేందుకు ప్రయత్నిందని ఆప్ నేతలు ఆరోపించారు.

## ఉత్పత్తి చేసిన తేనె వైల్డ్ ఫ్లేవర్స్‌ను ఆవిష్కరించిన కొండా సురేఖ




హైదరాబాద్ : అటవీ కళాశాల, పరిశోధనా సంస్థ (ఎఫ్‌సిఆర్ఐ ) ఆధ్వర్యంలో శాస్త్రీయంగా పెంచుతున్న తేనెటీగల కేంద్రంలో తయారు చేసిన ఆర్గానిక్ (సేంద్రియ) తేనెను అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. సేంద్రియ ఉత్పత్తులను ఆదరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రైతులకు తేనెటీగల పెంపకం, ఆదాయ అభివృద్ధిపై శిక్షణను ఇచ్చేందుకు హైదరాబాద్ శివారు ములుగులో ఉన్న ఫారెస్ట్ కాలేజీలో ప్రత్యేక తేనెటీగల పెంపకం, ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పారు. రైతులతో పాటు ఔత్సాహిక వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, మహిళలకు తేనెటీగల పెంపకంపై వారం రోజుల శిక్షణా కార్యక్రమాలను ఫారెస్ట్ కాలేజీ అందిస్తున్నది. ఈ సెంటర్ ఆధ్వర్యంలో పూర్తి సేంద్రీయ పద్ధతుల్లో అభివృద్ధి చేసిన తేనెను వైల్ ఫ్లేవర్స్ బ్రాండ్ పేరుతో ఫారెస్ట్ కాలేజీ అందుబాటులోకి తెస్తున్నది. ములుగు ఫారెస్ట్ కాలేజ్ లో త్వరలో ఒక తేనె విక్రయ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు డీన్ ప్రియాంక వర్గీస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియల్, ఫారెస్ట్ కాలేజీ డీన్ ప్రియాంక వర్గీస్, తదితరులు పాల్గొన్నారు.

## ఏటా రెండుసార్లు టెట్?

**హైదరాబాద్ ఫిబ్రవరి, 26 ):** ఉపాధ్యాయ ఉద్యోగార్థులకు నిర్వహించే ఉపాధ్యాయ అర్హత (టెట్) పరీక్షను ఇక నుంచి ఏటా రెండు సార్లు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ఏటా జూన్, డిసెంబర్ నెలల్లో టెట్ పరీక్షను నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ నిర్ణయంతో ఇక నుంచి డిఎస్‌సి నోటిఫికేషన్లతో సంబంధం లేకుండా ఏటా రెండుసార్లు టెట్ పరీక్షను నిర్వహిస్తారు. టెట్ నిర్వహణకు 90 రోజుల సమయం పట్టనుండగా, అంతకు ముందే నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్నారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సిఆర్‌టి) ఏటా రెండుసార్లు టెట్‌ను నిర్వహించాలని ఆదేశించింది. అంతే కాకుండా టెట్ గడువును 7 ఏండ్ల నుంచి జీవితకాలానికి పొడగించింది. అయితే గతంలో టెట్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు సైతం వారి స్కోర్ పెంచుకునేందుకు ఎన్నిసార్లు అయినా టెట్ రాస్తారు. టీచర్లకు టెట్ తప్పనిసరి అనే నిబంధన అమలులోకి వచ్చిన తర్వాత బి.ఇడి, డిఐఇడి కోర్సులను పూర్తిచేసిన వారు మాత్రమే టెట్ పరీక్ష రాశారు. టెట్‌లో ఉత్తీర్ణత సాధిస్తేనే ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండటంతో ఉపాధ్యాయ విద్య పూర్తి చేసిన అభ్యర్థులందరూ తప్పనిసరిగా టెట్ రాసి, అందులో ఉత్తీర్ణత పొందేవారు. కానీ ఇప్పుడు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు పేపర్ -2లో టెట్ ఉత్తీర్ణత పొందాలన్న నిబంధనను పాటించాల్సి ఉండటంతో ఇక నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయులు సైతం టెట్‌కు పోటీపడనున్నారు. అలాగే ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లకు కూడా టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి అనే నిబంధన ఉంది.

## సంపాదకీయం

### కృష్ణా జలాలపై...

# కుప్పిగంతులు

గత కేసీఆర్ ప్రభుత్వం కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం చేసిందని, జగన్‌రెడ్డితో కుమ్మక్కై ఏపీకి దోచి పెట్టిందని తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ విషయంపై ఏపీ అసెంబ్లీలో సీఎం జగన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కూడా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. దీనిపై ఏపీ నీటిపారుదల శాఖా మంత్రి అంబటి ఇదంతా కాంగ్రెస్ %--% బీఆర్ఎస్‌ల మధ్య రాజకీయ పోరులో భాగమే గానీ, నిబంధనలకు విరుద్ధంగా ఏపీ ఒక్క చుక్క కూడా అదనంగా తీసుకోలేదని పేలవంగా స్పందించారు. అంతేతప్ప గణాంకాలతో వివరించే ప్రయత్నం చేయలేదు. జగన్‌రెడ్డి %--% కేసీఆర్‌ల మధ్య ఉన్న స్నేహబంధం అనేక విషయాల్లో నిరూపితమైంది. అయితే నిజంగా ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ఆరోపిస్తున్నట్టు కృష్ణా జలాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏపీకి దోచిపెడితే, ఆ నీటిని వైసీపీ ప్రభుత్వం సద్వినియోగం చేసుకుని ఉంటే, కృష్ణా డెల్టా పరివాహక ప్రాంతం గానీ, రాయలసీమ ప్రాంతం గానీ సస్యశ్యామలం అయ్యుండేదిగా అనే ప్రశ్నకు ఎవరివద్దా సమాధానం లేదు. అసలు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణల్లో నిజమెంత అన్నది కూడా మనం ఒక్కసారి ఆలోచించాలి. జగన్‌రెడ్డి %--% కేసీఆర్‌ల మధ్య ఉన్న స్నేహసంబంధాలు వారి రాజకీయ, ఆర్థిక ఎదుగుదలకు మాత్రమే గానీ, రెండు తెలుగు రాష్ట్ర ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేదన్నది వాస్తవం. వారి స్నేహం వలన ఒక్క విభజన సమస్య కూడా పరిష్కారం కాలేదు. పైగా తెలంగాణ ఎన్నికల వేళ సాగర్ డ్యామ్‌పై రెండు రాష్ట్రాల పోలీసులతో కేసీఆర్ %--% జగన్ రెడ్డిలు చేసిన హైడ్రామా వారి మధ్య ఉన్న బలమైన చీకటి స్నేహాన్ని బయటపెట్టింది. అయితే ఈ హఠాత్పరిణామాలకు తెలంగాణలో నెలకొన్న రాజకీయ పరిస్థితులే కారణం తప్ప మరొకటి కాదనే వాదనలు బలంగానే వినిపిస్తున్నా, ఆ కారణం కూడా ఒకింత నిజమే అయినా, భవిష్యత్తులో రెండు రాష్ట్రాలలో అధికారంలో ఉండే ప్రభుత్వాల స్వార్థ రాజకీయాలకు నీటి ప్రాజెక్టులు కూడా ఆయుధాలు అవుతాయి కాబట్టి, అనేక ఏళ్ల తరబడి రగులుతూనే ఉన్న ఈ నీటి సమస్యలకి ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం జరగాలని అందరూ కోరుకుంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 1995 ఫిబ్రవరి 15న వచ్చిన జీవో నం. 69లో 834 అడుగుల నీటి మట్టం క్రింద విద్యుత్ ఉత్పత్తి చేయకూడదని, ఆ విద్యుత్ ఉత్పత్తి చేసేటప్పుడు 834 అడుగుల పైన కూడా నాగార్జునసాగర్ వద్ద కృష్ణా డెల్టాలో ఇరిగేషన్‌కు నీరు అవసరం ఉన్నప్పుడు మాత్రమే జల విద్యుత్ చేయాలని పేర్కొన్నారు. అయితే 800 అడుగులకు కూడా నీరు చేరకుండానే ఎడమవైపు నుంచి గత కేసీఆర్ ప్రభుత్వం జల విద్యుత్ ఉత్పత్తి చేసి జీవో 69ను ఉల్లంఘించింది. ఏపీ ప్రభుత్వం దీనిపై కృష్ణా యాజమాన్య బోర్డుకు ఫిర్యాదు చేయగా, బోర్డు కూడా విద్యుత్ ఉత్పత్తి చేయడం ఆపాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ ఆదేశాలను కూడా గత తెలంగాణ ప్రభుత్వం బేఖాతరు చేస్తూ పోలీసు పహారాలో సాగర్, జూరాల, పులిచింతల వద్ద నూరు శాతం జల విద్యుత్తును ఉత్పత్తి చేసింది. పులిచింతల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కట్టిందే కృష్ణా డెల్టా కోసం. దానికి వేరే ఆయకట్టు లేదు. పులిచింతల వద్ద వదిలేస్తే నీరు డైరెక్టుగా ప్రకాశం బ్యారేజీకి చేరుకుంటుంది. అక్కడ 3 టీఎంసీలకంటే ఎక్కువ నీరు నిల్వ చేయడానికి లేదు. తెలంగాణ ప్రభుత్వం జలవిద్యుత్‌తో విడుదల చేస్తున్న నీరు అంతా వృథాగా సముద్రంలోకి పోతోంది. అవసరానికి మించి కృష్ణా డెల్టాకు కాలువల ద్వారా నీరు విడుదల చేసే అవకాశం లేదు. అందుకే 834 అడుగుల లోపు నీటి మట్టం వద్ద జల విద్యుత్ చేయకూడదనే నిబంధన అప్పట్లోనే పెట్టారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మించేటప్పుడు జల విద్యుత్ ప్రాజెక్టుగానే నిర్మించినా 1981లో శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్ (ఎస్సార్బీసీ)ని డిజైన్ చేశాక ఆ ప్రాజెక్టును బహుళార్ధ సాధక ప్రాజెక్టుగా మార్చారు. ఎడమవైపున ఉన్న శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్సెల్బీసీ) ఆ తరువాత కట్టిందే అన్నది తెలంగాణ ప్రభుత్వం ఎందుకు విస్మరిస్తుందో అర్థం కానిది. ముందుగానే కట్టిన కుడి కాలువ వైపున విద్యుత్తును ఉత్పత్తి చేయకుండా, నీళ్లు లేకపోయినా కూడా తర్వాత కట్టిన ఎడమ కాలువ వైపునుండి జల విద్యుత్ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం చెప్పడం ఎంతవరకు సబబో ఆలోచించాలి. బచావత్ ట్రిబ్యునల్ వినియోగ ప్రాతిపదికపై ప్రాజెక్టుల వారీగా నీటిని కేటాయించింది. పర్యవసానంగానే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టీఎంసీల కేటాయింపు జరిగింది. జూరాల, రాజోలిబండ మళ్లింపు పథకం, కేసీ కెనాల్, తుంగభద్ర ఎగువ కాలువ దిగువ కాలువ, నాగార్జునసాగర్ కుడి ఎడమ కాలువలు, కృష్ణా డెల్టాకు విస్పష్టంగా నీటిని కేటాయించింది. దాన్ని వక్రీకరించడానికి, ప్రాజెక్టుల వారీగా నీటిని కేటాయించలేదని అడ్డగోలుగా వాదించడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కూడా బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులను మార్చడానికి వీల్లేదని విస్పష్టంగా తన తీర్పులో పేర్కొన్న వాస్తవాన్ని గుర్తుంచుకోవాలి.

## అలియాబాద్‌లో అంగరంగ వైభవంగా...

# చిత్తరమ్మ తల్లి జాతర





**శామీర్ పేట (గరుడ వార్త):** చిత్తారమ్మ తల్లి దీవెనలతో అలియాబాద్ గ్రామం సుభిక్షంగా ఉండాలని జిల్లా నాయకులు కమటం కృష్ణారెడ్డి ఆకాంక్షించారు. అలియాబాద్ గ్రామంలో కొలువుదీరిన చిత్తారమ్మ తల్లికి అంగరంగ వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించి చిత్తారమ్మ తల్లి జాతర నిర్వహించారు. శామీర్ పేట మండలం అలియాబాద్ గ్రామంలోని శ్రీ చిత్తరమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి జాతర ఉత్సవాలు సోమవారం ఎంతో ఘనంగా నిర్వహించారు. శామీర్ పేట మండల అలియాబాద్ గ్రామంలో కొలువుదీరి ఉన్న శ్రీ చిత్తారమ్మ తల్లి జాతరలో జిల్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ మాజీ సర్పంచ్ కమటం కృష్ణారెడ్డిలు హాజరై అమ్మవారికి ప్రతేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా గ్రామ ఎంపిటిసి సభ్యుడు సగ్గు శ్రీనివాస్ యాదవ్ భక్తులకు అన్నదాన వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఇప్ప మాధవరెడ్డి, నాటకారి నర్సింహులు,సొప్పరి కృష్ణ, ఎం. నర్సింహా, సత్యనారాయణ, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ప్రజావాణి కార్యక్రమానికి 120 అర్జీలు



**జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా మొత్తం 120 అర్జీలు రాయని తెలిపారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయము లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 120 అర్జీ లను సి, డి సెక్షన్ ల సూపరింటెండెంట్ లు గీత, భూపాల్ స్వీకరించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా వెంటనే సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞానవాపి సెల్లార్‌లో పూజలు చేసుకోవచ్చు.. ముస్లింల పిటీషన్ తిరస్కరించిన హైకోర్టు

న్యూఢిల్లీ: జ్ఞానవాపి మసీదులో ని సెల్లార్‌లోని ఉన్న దేవుళ్లకు పూజలు చేసేందుకు వారణాసి కోర్టు ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలంటూ ముస్లింలు పెట్టుకున్న అభ్యర్థనను ఇవాళ అలహాబాద్ హైకోర్టు తోసిపుచ్చింది. వ్యాస్ తెహఖానాలో హిందువుల ప్రార్థనలను కొనసాగుతాయని జస్టిస్ రోమిత్ రంజన్ అగర్వాల్ తెలిపారు. మసీదు కమిటీ వేసిన పిటీషన్‌ను ఆయన తిరస్కరించారు. వ్యాస్ తెహఖానా సెల్లార్‌లో హిందువులు పూజలు చేసుకునేందుకు గత నెలలో వారణాసి కోర్టు అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. శైలేంద్ర కుమార్ పాఠక్ వేసిన పిటీషన్ ఆధారంగా గతంలో జిల్లా కోర్టు ఆదేశాలు ఇచ్చింది. తమ తాతయ్య సోమనాథ్ వ్యాస్.. 1993 డిసెంబర్ వరకు ఆ సెల్లార్‌లో పూజలు చేసినట్లు ఆయన తన పిటీషన్‌లో తెలిపారు. అయితే వారసత్వం కింద తెహఖానాకు వెళ్లి పూజలు చేసుకునే అవకాశం కల్పించాలంటూ శైలేంద్ర తన పిటీషన్‌లో కోరారు. కాశీ విశ్వనాథుడి ఆలయ పరిసరాల్లో ఉన్న జ్ఞానవాపి మసీదులో మొత్తం నాలుగు సెల్లార్లు ఉన్నాయి. అందులో ఒక సెల్లార్ ఇంకా వ్యాస్ ఫ్యామిలీ వద్దే ఉన్నట్లు తెలుస్తోంది. శైలేంద్ర వేసిన పిటీషన్‌ను మసీదు కమిటీ కొట్టిపారేసింది.

సెల్లార్‌లో ఎటువంటి దేవతామూర్తులు లేవని ఆ కమిటీ పేర్కొన్నది. అందుకే 1993 వరకు అక్కడ ఎటువంటి పూజలు కూడా జరగలేదని మసీదు కమిటీ తెలిపింది. ఈ కేసులో మసీదు కమిటీ ఫిబ్రవరి రెండో తేదీన సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కానీ అత్యున్నత న్యాయస్థానం ఆ పిటీషన్‌ను తిరస్కరిస్తూ.. హైకోర్టును ఆశ్రయించాలని కోరింది. ఫిబ్రవరి 15వ తేదీన ఇరు వర్గాల వాదనలు విన్న అలహాబాద్ హైకోర్టు తీర్పును రిజర్వ్‌లో పెట్టింది.

## ఏపీ రాజకీయ నేతలకు వార్నింగ్ ఇచ్చిన మోహన్ బాబు

ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికల సమరం మొదలైన విషయం తెలిసిందే. ఏపీ అసెంబ్లీ ఎలక్షన్ నోటిఫికేషన్ రాకముందే పార్టీ నేతలు తమ అభ్యర్థులను ప్రకటించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తన పేరు వాడుకుంటున్న వారికి టాలీవుడ్ సీనియర్ నటుడు మోహన్ బాబు వార్నింగ్ ఇస్తూ సోషల్ మీడియా వేదికగా లేఖ విడుదల చేశారు. ఈ మధ్య కాలంలో నా పేరుని రాజకీయంగా కొందరు ఉపయోగించుకుంటున్నట్లుగా నా దృష్టికి వచ్చింది. దయచేసి ఏ పార్టీ వారైనా.. నా పేరును వారి వారి స్వప్రయోజనాల కోసం వాడుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాను. మనం అనేక రకాల భావావేశాలున్న వ్యక్తుల ప్రపంచంలో జీవిస్తున్నాము. ఎవరి అభిప్రాయాలు వారివి. అది వారి వారి వ్యక్తిగతం. చేతనైతే నలుగురికి సాయపడడంలోనే మనం దృష్టి పెట్టాలిగాని, సంబంధం లేని వారిని రాజకీయ పార్టీలలోకి, వారి వారి అనుబంధ సంస్థల్లోకి తీసుకురావడం బాధాకరం.

## రైతులను రాజులుగా తీర్చిదిద్దడం తమ ధ్యేయం



**శామీర్ పేట, (గరుడ వార్త) :** నెదర్లాండ్స్ రోబో బ్యాంక్, బేయర్ కంపెనీ సహకారంతో రైతులను రాజులుగా చేసే లక్ష్యం దిశగా అడుగులు పడుతున్నాయని శామీర్ పేట రైతు సేవ సహకార సంఘం చైర్మన్ మధుకర్ రెడ్డి అన్నారు. సోమవారం శామీర్ పేట రైతు సేవ సహకార సంఘం కార్యాలయాన్ని చైర్మన్ మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో బేయర్ కంపెనీ, రాష్ట్రానికి చెందిన సహకార అపెక్స్ బ్యాంకుకు చెందిన ప్రతినిధులు సందర్శించి పని తీరును పరిశీలించారు. అలాగే మూడు చింతలపల్లి మండలంలోని పోతారం గ్రామ పరిధిలో గల పలువురి రైతుల వ్యవసాయ క్షేత్రాలను సైతం వారు సందర్శించి పరిశీలించారు. ఆ వ్యవసాయ క్షేత్రాల్లో డ్రోన్ సహాయంతో మందులు చల్లే పనితీరు విధానాన్ని ప్రయోగాత్మకంగా బేయర్ కంపెనీ వారు నెదర్లాండ్స్ బృందం ఆధ్వర్యంలో రైతులకు చూపించారు. రూ. 600కే డ్రోన్ సహాయంతో వివిధ పంటలకు మందులను చల్లే విధంగా రూపొందించినట్లు బేయర్ కంపెనీ ప్రతినిధులు రైతులకు అవగాహన కల్పించారు. కాగా నెదర్లాండ్స్ రోబో బ్యాంకు ప్రతినిధులు రైతు సహకార సంఘం డైరెక్టర్లతో, రైతులతో మాట్లాడి ఇక్కడి వ్యవసాయ క్షేత్రాల వివిధ పంటల పనితీరును, లాభాలను, దిగుబడుల పట్ల అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సహకార సంఘం చైర్మన్ మధుకర్ రెడ్డి మాట్లాడుతూ రైతుల ఎదుగుదల, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం సంచలనమైన నిర్ణయం తీసుకొని నెదర్లాండ్స్ దేశానికి చెందిన రోబో బ్యాంకు తో రుణాలను కల్పించడం ఎంతో గర్వకారణం అని తెలిపారు. నెదర్లాండ్స్ దేశానికి చెందిన రోబో బ్యాంక్, తెలంగాణ రాష్ట్రంలోని రైతులకు రుణాలు ఇచ్చేందుకై ముందుకు వచ్చి అండగా నిలిచినందుకు ఆయన కృతజ్ఞతలు చెప్పారు. రాష్ట్రంలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు వారు సహకారం అందిస్తుందని ఆయన వివరించారు. అలాగే రైతులకు బేయర్ కంపెనీవారు నాణ్యమైన విత్తనాలను, ఎరువులను అందించి తోడ్పాటున అందించే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం ఎంతో శుభ పరిణామమని ఆయన తెలిపారు. రైతులు పండించిన పంటలకు లాభాలు పొందే దిశగా నిరంతరం తమ సహాయ సహకారాలు ఉంటాయని చైర్మన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతు సహకార సంఘం వైస్ చైర్మన్ ఐలయ్య యాదవ్, మాజీ చైర్మన్ పెంటారెడ్డి, డైరెక్టర్లు, సీఈఓ నర్సింలు, రైతులు పాల్గొన్నారు.

## అంగన్ వాడి పిల్లలకు పౌష్టికాహారాన్ని అందజేసిన హెచ్‌బిఎల్ కంపెనీ



**శామీర్ పేట, (గరుడ వార్త) :** అంగన్ వాడి కేంద్రాల్లో చదువుకుంటున్న చిన్నారులను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడం మీ లక్ష్యంగా తాము పౌష్టికాహారాన్నిస్తూ వీలైనంత మేర అందిస్తున్నామని హెచ్ బి ఎల్ కంపెనీ సి ఎస్ ఆర్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి అన్నారు. సోమవారం మండల కేంద్రం శామీర్ పేట లో నాలుగు అంగన్ వాడి కేంద్రాలకు మండల పరిధిలోని హెచ్ బి ఎల్ కంపెనీ వారు సిఎస్ఆర్ ప్రోగ్రాం కింద దత్తత తీసుకొని ఐ సి డి ఎస్ ఆధ్వర్యంలో పౌష్టి కాహారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సి ఎస్ ఆర్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి, ఐసిడిఎస్ అంగన్వాడి సూపర్వైజర్ పద్మ, ఎంపీపీ ఎల్లుబాయి, జడ్పిటిసి అనిత లు కలిసి అంగన్వాడి పిల్లలకు పౌష్టికాహారం కింద పాలు, అరటి పళ్ళు, పల్లి పట్టిలు అలాగే రెండు జతల యూనిఫామ్ దుస్తులు అందజేశారు. అంగన్ వాడి కేంద్రాల్లో పిల్లలు కూర్చోవడానికి చాపలు, బరువు కొలిచే మిషిన్లు, పిల్లలు పాలు తాగడానికి కప్పులు, పిల్లలు రాసుకోవడానికి పలకలను, అంగన్వాడీ టీచర్లకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ బీ ఎల్ కంపెనీ సి ఎస్ ఆర్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడి చిన్నారులు బలవర్ధంగా, ఆరోగ్యంగా ఉండేందుకై తమ హెచ్ బీ ఎల్ కంపెనీ తరఫున నిత్యం పాలు, అరటి పళ్ళు, పల్లి పట్టిలు పంపిణీ చేస్తామని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలలో 25 అంగన్వాడి కేంద్రాల్లోని పిల్లలకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్లు ఆమె చెప్పారు. 2008 నుంచి రాష్ట్రంలోని పలు అంగన్వాడి కేంద్రాల్లో 2003 మంది పిల్లలకు తమ హెచ్ బి ఎల్ కంపెనీ తరఫున సిఎస్ఆర్ ప్రోగ్రాం కింద పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే అంగన్వాడి కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలను కల్పిస్తున్నట్లు ఆమె చెప్పారు. ఎంతో ఉన్నత ఆశయంతో ముందుకు వచ్చి శామీర్ పేటలోని అంగన్వాడి పిల్లలకు సౌకర్యాలతో పాటు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నందుకు హెచ్ బీ ఎల్ కంపెనీ హెడ్ రాఘవేంద్రరెడ్డి, సి ఎస్ ఆర్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి లకు ఎంపీపీ ఎల్లుబాయి, జడ్పిటిసి అనితలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ బీ ఎల్ కంపెనీ ప్రతినిధులు పద్మ, చిరంజీవి, సాయి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గరుడ వార్త

మంగళవారం, ఫిబ్రవరి 27, 2024

## రైతులపై మోడీ ప్రభుత్వం క్రూరమైన అణచివేతకు పాల్పడుతోంది




హైదరాబాద్ : తమ పంటకు కనీస మద్దతు ధర ఇవ్వాలని కోరుతూ ఢిల్లీ సరిహద్దులలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై మోడీ ప్రభుత్వం క్రూరమైన అణచివేతకు పాల్పడుతుందని సిపిఐ జాతీయ కార్యదర్శి డా. కె. నారాయణ తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతుల బాధల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రైతుల నిరసనకు వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వ భారీ పోలీసు–సైనిక అణిచివేతను నిరసిస్తూ హైదరాబాద్, ట్యాంక్ బండ్, అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం సిపిఐ భారీ ప్రదర్శన నిర్వహించింది. సిపిఐ శ్రేణులు ఎర్ర జండాలు, ప్లకార్డులు చేతబూని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేస్తూ, ఆందోళనలు చేస్తున్న రైతు సమాజానికి సంఘీభావం తెలిపారు. ఈ ప్రదర్శనలో డా. కె. నారాయణతో పాటు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్యపద్మ, కలవేణి శంకర్, ఎన్. బాలమల్లేష్, ఈ.టి. నరసింహ, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయా దేవి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. కె. నారాయణ మాట్లాడుతూ రైతుల ఆందో ళనను అణిచివేయాలని మోడీ ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందుకుసాగుతుందని, పోలీసులతో పాశవికంగా దాడులు చేయిస్తూ హత్యాకాండ ను సృష్టిస్తుందని ఆరోపించారు. పంజాబ్– హర్యానా సరిహద్దులో నిరసన తెలుపుతున్న రైతుపై జరిగిన పోలీస్ కాల్పుల్లో శుభకరన్ సింగ్ అనే రైతు మృతి ఘటనపై కేంద్ర ప్రభుత్వంపై హత్య కేసు నమోదు చేయాలని అయన డిమాండ్ చేశారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న ప్రధాని మోడీ తప్పుడు వాగ్దానాలు చేసి, రైతులను విశ్వాసంలోకి తీసుకోకుండా రైతు వ్యతిరేక చట్టాలను ప్రయోగించి బడా వ్యాపారులకు వ్యవసాయాన్ని అప్పగించే ప్రయత్నాలను కేంద్ర బిజెపి ప్రభుత్వం చేస్తుందని పేర్కొన్నారు. పంటలకు కనీస మద్దతు ధరపై కేంద్రం చట్టపరమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించకుంటే దేశ వ్యాప్తంగా ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని డా. కె. నారాయణ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రైతులను తీవ్రంగా నష్టపరిచే వివాదాస్పద వ్యవసాయ చట్టాలు తీసుకురావడంపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై మండిపడ్డారు. రైతులు మునుపెన్నడూ లేని విధంగా కష్టాల్లో కూరుకుపోతున్నందున తమ సమస్యల పరిష్కారానికి ఆందోళనలు నిర్వహిస్తున్నారని, రైతుల బాధల పట్ల మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. స్వామినాథన్ కమీషన్ సిఫార్సుల అమలు, రైతులు మరియు రైతు కూలీలకు పెన్షన్, పోలీసు కేసుల ఉపసంహరణ మరియు 2021 లఖింపూర్ ఖేరీ హింసాకాండ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి. వెంకటేశం, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్. అంజయ్య నాయక్, సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి. స్టాలిన్, కార్యవర్గ సభ్యులు నిర్లేకంటి శ్రీకాంత్, జి. చంద్రమోహన్ గౌడ్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, మేడ్చల్ జిల్లా సిపిఐ నేతలు జె.లక్ష్మి, ఉమామహేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మరాఠా కోటా ఉద్యమనేత మనోజ్ జారంగే నిరాహార దీక్ష విరమణ

ముంబై : మరాఠా కోటా ఉద్యమనేత మనోజ్ జారంగే గత 17 రోజులుగా మరాఠా కోటాపై సాగిస్తున్న నిరవధిక నిరాహార దీక్షను సోమవారం విరమించారు. అయితే కుంబీ కుల ధ్రువ పత్రాలను మహారాష్ట్ర ప్రభుత్వం మరాఠా తెగలందరికీ పంపిణీ చేయడం ప్రారంభించే వరకు ఈ ఉద్యమాన్ని తాను కొనసాగిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఆయా కుటుంబ సభ్యులందరికీ ఇలాంటి డాక్యుమెంట్లు ఉన్నప్పటికీ ఈ ధ్రుప పత్రాలు అందించాల్సి ఉందని, దీనివల్ల రిజర్వేషన్ ఫలితాలు అందరికీ అందుతాయని చెప్పారు. ఉద్యోగాల్లోను, చదువుల్లోను మరాఠా కోటా కల్పించాలన్న డిమాండ్ల సాధనకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురాడానికి ముంబై మార్చ్ చేపడతామని ప్రకటించడం, ముంబైలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కావడం ఈ రెండూ ఒకేసారి కావడంతో మనోజ్ జారంగే తన దీక్షను విరమించడానికి నిర్ణయం తీసుకున్నారు. గత వారం మహారాష్ట్ర అసెంబ్లీ ఉభయసభలు మరాఠా కమ్యూనిటీకి చదువుల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేకంగా 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించాయి. అయితే ఒబిసి కేటగిరిలో ఉన్న మరాఠా కమ్యూనిటీకి కూడా ఉద్యోగాల్లో, చదువుల్లో 10 శాతం ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 10 నుంచి జల్నా జిల్లా అంతర్వాలి సారథి గ్రామంలో జారంగే నిరాహార దీక్ష చేపట్టారు. " ఈ రోజు తాను నిరవధిక నిరాహార దీక్ష విరమించినప్పటికీ తనకు బదులుగా ముగ్గురు లేదా నలుగురు నిరాహార దీక్ష కొనసాగిస్తారని జారంగే తెలిపారు. తాను కూడా కొన్ని గ్రామాలకు వెళ్లి తన వైఖరిని ప్రజలకు వివరిస్తానని చెప్పారు. హోం శాఖ ఆంక్షలు విధించినందున అంతర్వాలి సారది గ్రామానికి వచ్చి తనను చాలా మంది కలుసుకోలేక పోతున్నారని తెలిపారు. కోటా ఉద్యమంపై అనేక ఫిర్యాదులు పోలీస్‌లకు వెళ్లాయనగా, తనను విచారించడానికి తనవద్ద ఎలాంటి సమస్యలు లేవని, కానీ వారు ఏదోవిధంగా ఇబ్బందులు కల్పించడానికి ప్రయత్నిస్తున్నారని జారంగే చెప్పారు. ప్రజలు ఆగ్రహిస్తే సిఎం, హోం మంత్రి తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. డిప్యూటీ సిఎం ఫడ్నవీస్ బ్రాహ్మణ కులస్థుడని జారాంగే ఆదివారం కొన్ని ఆరోపణలు చేయడంపై ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే జారంగేను తీవ్రంగా హెచ్చరించారు.

# మళ్లీ మందిర్... మండల్ మార్గమేనా?





మూడు పరిణామాల ప్రస్తావన లేకుండా సమకాలీన భారత చరిత్రను సమగ్రంగా చెప్పుకోలేం. ప్రైవేటు రంగానికి పెద్దపీట వేసే ఆర్థిక సంస్కరణలు వాటిల్లో మొదటిది. రెండోది అయోధ్యలో రామజన్మభూమి – బాబ్రీ మసీదు చుట్టూ తిరిగిన రాజకీయం. మూడోది.. వెనుకబడిన వర్గాలకు (బీసీలు) రిజర్వేషన్లు ప్రతిపాదించిన మండల్ కమిషన్ సిఫార్సులు. మొదటిదానిపై రాజకీయ పార్టీల మధ్య భేదాభిప్రాయాల్లేవు. మందిర్–మండల్ విధానాలను అలా భావించలేం. అవి ఇంకా విభేదాలను రగుల్చుతూనే ఉన్నాయి. రామాలయం చుట్టూ నెలకొల్పిన ఉద్వేగాలను ఆధారం చేసుకుని వచ్చే ఎన్నికల్లో భారీ ఆధిక్యతతో గెలవాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. కులాలు కలిగించిన అసమానతలు, విభేదాలను నిర్వీర్యం చేయగలిగిన శక్తి హిందూ జాతీయవాదానికి ఉందనే నమ్మకం బీజేపీ రాజకీయాలకు కీలకం. మత ధర్మాన్ని, సంస్కృతిని మహోన్నతంగా భావించే జాతీయవాదానికి ఎన్ని సుభాష్యాలు చెప్పినా ఇతర మతాల ప్రజలకు సమానస్థాయిని ఇవ్వకపోవటం అందులో ప్రముఖంగా ఉంటుంది. చాలా దేశాల్లో అదే జరిగింది. హిందూ మతాన్ని ఒక జీవన విధానంగా భావించాలనే వాదన మనందరికీ తెలిసిందే. దాంతో విభేదించాల్సిన పనిలేదు. ఏ మతమైనా జీవన విధానమే. పాపపుణ్యాలూ, మంచీచెడూ, మనుషుల్లో తక్కువా ఎక్కువలు, ఇహపరలోక పరమార్థాలు, రాజ్యాధికారానికి అర్హతలు లాంటి వాటిని నిర్దేశించటం అన్ని మతాల్లోనూ ఉంటాయి. హిందూ సంస్కృతిలోని మంచిచెడుల లోతుల్లోకి వెళ్లకుండా కులాల పరంగా అధికారం, పదవుల పంపకాలపై దృష్టిపెట్టటం ఇప్పటి మండల్ రాజకీయాల్లో కీలకం. అంబేద్కర్‌లాగా కులాల అసమానతలకు ఆధారంగా ఉన్న మతభావాలపై పోరాటం సాగించటానికి మండల్ వాదులు సుముఖంగా లేరు. మందిర్ రాజకీయాలతో బాగా నష్టపోయిన కాంగ్రెస్ ఇప్పుడు మండల్ అజెండాపై ఆశలు పెట్టుకుని బలం పుంజుకోవాలని చూస్తోంది. దీన్నే అస్త్రంగా చేసుకుని ఇటీవల జరిగిన అయిదు రాష్ట్రాల ఎన్నికల బరిలోకి దిగినా తెలంగాణలో తప్ప ఎక్కడా గెలవలేదు. కులగణనకు హామీ ఇచ్చినా ఎటువంటి ప్రభావాన్ని చూపలేదు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతే కాంగ్రెస్‌ను గెలిపించింది. కులగణన, కుల న్యాయాలు ప్రభావం చూపలేదు. అయినా మండల్ రాజకీయాలపై కాంగ్రెస్ ఆశలు అణగారలేదు. తెలంగాణ అసెంబ్లీలో కులగణనకు తీర్మానాన్ని ప్రవేశపెట్టటమే ఇందుకు నిదర్శనం. సామాజిక న్యాయ రాజకీయాలకు ప్రధాన ఆధారం మండల్ కమిషన్ సిఫార్సులు. దానికంటే ముందు 1953లో కాకా కలేల్కర్ (తొలి బీసీ) కమిషన్ ఏర్పాటైంది. కులాలు, వాటి వెనుకబాటు, వాటికి కల్పించాల్సిన రిజర్వేషన్ల గురించి ఆ రెండు కమిషన్లు ఏం చెప్పాయో పరిశీలిస్తే చాలా విషయాలు తెలుస్తాయి. పరిమితులూ అర్థమవుతాయి. ఇప్పటికి అవి ఎంతమేరకు పనికొస్తాయో అంచనానూ వేయవచ్చు. కలేల్కర్ కమిషన్ 1955 మార్చి 30న నివేదికను ఇచ్చింది. మండల్ కమిషన్ 1978 డిసెంబర్ 20న ఏర్పాటై 1980 డిసెంబర్ 31న నివేదికను సమర్పించింది. 20 ఏళ్ల తర్వాత రిజర్వేషన్లను సమీక్షించాలని మండల్ కమిషన్ చెప్పినప్పటికీ అందుకు ఏ పార్టీ ఇప్పటికీ సిద్ధంగా లేదు. బీసీల జనాభా ఎంతో తేలాలన్న డిమాండు 1980లకు ముందూ ఉంది. ఆ వర్గాల జనాభా 52 శాతం ఉంటుందని మండల్ కమిషన్ అంచనా వేసినా అది శాస్త్రీయంగా వేసిన లెక్కకాదు. చాలా పరిమితులతో వేసిన అంచనాగానే కమిషనే పేర్కొంది. కులాల లెక్కలను సేకరించటం 1881 మొదలై 1931తో ఆగిపోయింది. ఆ అర్ధ శతాబ్దిలో ప్రతి పదేళ్లకొకసారి పెరిగిన ఆయా కులాల జనాభా పెరుగుదల రేటును మండల కమిషన్ పరిగణనలోకి తీసుకుంది. ఆ తర్వాతి అర్ధ శతాబ్దికి (1931–1981) ఆ రేటుని అన్వయించి బీసీల సంఖ్య విషయంలో నిర్ధారణకు వచ్చింది. హిందూ బీసీల సంఖ్య 43.70 శాతంగా పేర్కొంది. ముస్లింలు, ఇతర మతాల్లో బీసీలు 8.40 శాతంగా ఉంటారని లెక్కించింది. వేల కులాల్లో బీసీలుగా ఎవరిని పరిగణించాలన్నది అప్పటికీ ఇప్పటికీ పెద్ద సవాలే. ఇందుకోసం సామాజిక, విద్య, ఆర్థిక అంశాలకు సంబంధించి 11 సూచికలను కమిషన్ గుర్తించింది. సామాజిక అంశాలకు సంబంధించి నాలుగు సూచికలను గుర్తించి ఒక్కొక్క దానికి మూడు పాయింట్లు ఇచ్చింది. విద్యకు సంబంధించి మూడు సూచికలకు ఒక్కో దానికి 2 పాయింట్లను కేటాయించింది. ఆర్థిక అంశాలకు నాలుగు సూచికలను గుర్తించి ఒక్కో పాయింటును ఇచ్చింది. ఈ పాయింట్ల వ్యవహారాన్ని చూస్తే కులం సామాజిక స్థాయికే (12 పాయింట్లు) మండల్ కమిషన్ ప్రాధాన్యం ఇచ్చింది. ఒక కులానికి 11 గానీ అంతకు మించి గానీ పాయింట్లు వస్తే దాన్ని బీసీ కులంగా పరిగణించింది. ఏదైనా కులాన్ని వెనుకబడిన కులంగా మిగతా కులాలు భావిస్తే మూడు పాయింట్లు ఇచ్చారు. శారీరక శ్రమపైనే జీవిస్తే మరో మూడు పాయింట్లు వేశారు. రాష్ట్ర సగటు వివాహ వయస్సు కంటే తక్కువగా.. 17 ఏళ్లకు లోపల పెళ్లిచేసుకునే మహిళల సంఖ్య 25శాతం, పురుషుల సంఖ్య 10శాతం ఏదైనా కులంలో అధికంగా ఉంటే ఆ కులానికి మూడు పాయింట్లు ఇచ్చారు. పట్టణాల విషయంలో ఈ శాతాలు 10, 5 ఉంటే సరిపోతుంది. ఏదైనా కులంలో రాష్ట్ర సగటుకు మించి 25 శాతం అధికంగా మహిళలు బయట పనులకు వెళితే మరో 3 పాయింట్లు కేటాయించారు. చదువు విషయంలోనూ ఇలాగే పాయింట్లు ఇచ్చారు. ఏదైనా కులంలోని పిల్లలు (5–15 ఏళ్లు) రాష్ట్ర సగటుకు మించి 25 శాతం అధికంగా పాఠశాలకు వెళ్లని పరిస్థితి ఉంటే విద్యా వెనుకబాటుకు ఒక సూచిక అయింది. పాఠశాలను పూర్తిగా మానివేసే పిల్లల సంఖ్య రాష్ట్ర సగటును మించి ఇదే శాతంలో ఉంటే మరో సూచికగా తీసుకున్నారు. రాష్ట్ర సగటు కంటే 25 శాతం తక్కువగా మెట్రిక్యులేట్స్ ఉంటే ఆ అంశాన్నీ సూచికగా పరిగణించారు.

# శ్రద్ధను కబళిస్తున్న క్షుద్ర ప్రభావాలు

'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం' అని పండిత సూక్తి. శ్రద్ధ వల్లనే జ్ఞానం లభిస్తుందని అర్థం. పిల్లలకు చదువు రావట్లేదు అంటే, కిందకి పరీక్షల్లో కంటే మార్కులు తగ్గినాయంటే, హోం వర్క్ అసైన్‌మెంట్ హ్యాండ్ రైటింగ్ ఏదీ సరిగ్గా చేయట్లేదంటే, ఆకతాయిలతో జట్టు కడుతున్నారంటే, ఆగమాగం అవుతున్నారంటే, అటు పేరెంట్సూ ఇటు టీచర్సూ ముక్తకంఠంతో వ్యక్తం చేసే అసహనం 'పోరల్లో శ్రద్ధ చచ్చింది, వీళ్లు బాగుపడరు' అనే. శ్రద్ధ ఉంటేనే కదా! అది లేకుండాపోయింది లేదా క్షీణించిందనేది నా అభిప్రాయం. అందుకే తల్లిదండ్రులతో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులతో యాజమాన్యాలతో నేను గట్టిగా మొరపెట్టుకునేదేమంటే బాలబాలికల్లో అందరికీ సమానంగా ఉండకపోవచ్చు, వాళ్లు శ్రద్ధను కోల్పోవచ్చు, కానీ శ్రద్ధ లేకుండా ఎవరూ ఉండరు, శ్రద్ధ చావదు అని. మరి, శ్రద్ధ ఎందుకు కోల్పోతున్నారో, శ్రద్ధ ఎందుకు లేకుండాపోతుందో మనం క్షుణ్ణంగా మాట్లాడుకోవాల్సివుంది. ఎందుకంటే శ్రద్ధ ఏకాగ్రత సావధానత పేరేదైనా ఆ సద్గుణం లోపిస్తే చదువొక్కటే కాదు, ఏ పనీరాదు, చేయలేం.

వైఫై సౌకర్యంతో సోషల్ మీడియా, బతుకుల్లోకి వెల్లువలా చొచ్చుకొచ్చిన ఆధునికత తాలూకు అనేక విషమాంశాలు పిల్లల ఏకాగ్రత మీదా, అవగాహనా సామర్థ్యం మీదా గొడ్డలి పెట్టుగా మారాయి. ఇంతకు ముందు నలభై, యాభై నిమిషాల పాటు తధేకంగా పాఠం విన్న విద్యార్థులు ఇప్పుడు క్లాసులో నాలుగైదు నిమిషాలు కూడా నిలకడగా కూర్చోలేకపోతున్నారు. ఏకాగ్రత, నిమగ్నత, కార్యోన్ముఖత పూర్తిగా దెబ్బతిని విద్యకు ఆవలి ప్రతికూల ప్రభావాల వైపు పడిపోతున్నారు. జీవితానికి అత్యవసరమైన చదువును నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆసక్తి మచ్చుకైనాలేని మందబుద్ధులుగా మారుతున్నారు. పిల్లల్లో శ్రద్ధ చచ్చిపోయిందనే తీవ్ర దూషణకూ కారణం అవుతున్నారు. అత్యంత గొప్పకాలాన్ని విలువల క్షీణయుగంగా ఇచ్ఛకొద్ది మార్చేస్తున్నారు. ప్రముఖ రచయిత్రి బ్రియన్నా వీస్ట్ చెబుతున్నట్టు నైపుణ్యాల దిశను వీడి స్వీయ విధ్వంసం వైపుకు పిల్లలు వాలిపోతున్నారు. ఈ క్లిష్ట పరిస్థితిలో పెద్ద వాళ్లంగా మనం చేయగలిగింది, చేయాల్సింది, చేయించగలగింది చేస్తే తిరిగి వాళ్ల శ్రద్ధను వాళ్లు పొందగలిగేలా ఏకాగ్రతను పునరుద్ధరించుకుంటారనేది నాకున్న విశ్వాసం, బలమైన నమ్మకం. మానసిక శాస్త్ర నిపుణులు సైతం ఇదే చెబుతున్నారు. ప్రపంచీకరణ అనంతర పరిణామాల నేపథ్యంలో విద్యా దృక్పథం మారిన సంగతి మనకు తెలిసిందే. బట్టీ కొట్టేదో జ్ఞాపకం పెట్టుకుని పరీక్షల్లో జవాబుల రూపంలో వాంతి చేసుకొని మరచిపోయేదో కాదు విద్య, ఆగామి నాయకులను, ఆలోచనా బృందాలను, మేధో ప్రచారకులను విద్య సమాజానికి అందించాల్సి వుంది. నూతన జాతీయ విద్యా విధానం ఘోషిస్తున్నట్టు సమాజ పరివర్తన, సమాజ రూపాంతరం రెండూ విద్య ద్వారా జరగాల్సిన మహోన్నత కార్యక్రమాలు. ఏ శ్రద్ధాలేని



కొత్తతరంతో 'పరివర్తన, రూపాంతరం' వంటి తాత్విక భావనలు, అవి నెరవేర్చే సమాజ నిర్మాణం ఎట్లా సాధ్యమవుతుందనేదే చిక్కు ప్రశ్న. ప్రసార మాధ్యమాల పరంగా ఇది ఫ్లాషీ వీడియోల, అంతంలేని నోటిఫికేషన్ల యుగం. శ్రద్ధ గురించి ఇప్పుడు యువత ఆందోళన చెందడంలేదని చెప్పలేం. ఒక్కో తరగతిపైకి వెళ్తున్నకొద్దీ ఇవాల్టి పిల్లల్లో ఆందోళన మరింత హెచ్చుతుంది. తీవ్రమైన శ్రద్ధా సంక్షోభంలో తాము ఎందుకు జీవిస్తున్నామనే విషయంలో యువత మరింత చికాకుపడుతున్నారు. శ్రద్ధా పునరుద్ధరణకై పూనుకున్న యువకులు చెపుతున్నదేమంటే– తమ మెదడు ఒక పని నుండి మరొక పనికి మారినప్పుడు మనోవ్యవస్థను పునర్నిర్మించవలసి వస్తుందని, ఇంతకు ముందు ఏం చేశామో గుర్తుంచుకోవాలి, అదే పని గురించి ఏమనుకున్నామో గుర్తుంచుకోవాలి. ఈక్రమంలో పనితీరు బలహీనపడుతుంది. వేగం స్తంభిస్తుంది. ఆన్‌స్క్రీన్ ఒకదాంట్లోంచి మరొక ప్లాట్ ఫాంకు మారడం మూలంగా తదుపరి అవసరమైన పని ఆగిపోతుంది. ఏం తోచదు అంటున్నారు టీనేజర్స్. దీన్నే 'స్విచ్–కాస్ట్ ఎఫెక్ట్' అంటాడు జోహన్ హారీ. పని చేయడానికి ప్రయత్నిస్తున్నప్పుడు, పని చేస్తున్నప్పుడు టెక్స్ట్‌లను, వీడియోలను తనిఖీ చేస్తే, టెక్స్ట్‌లను, వీడియోలను చూడటం కోసం వెచ్చించే కొద్దిపాటి సమయాన్ని మాత్రమే కోల్పోం. తదుపరి పనిపై దృష్టి కేంద్రీకరించడానికి పట్టే సమయాన్ని కూడా కోల్పోతున్నామనేదే విద్యార్థుల ఆందోళన. విద్య పట్ల శ్రద్ధ, విషయాసక్తి సన్నగిల్లుతున్న పరిస్థితిని మసాచుసెట్స్ యునివర్సిటీ న్యూరోసైంటిస్ట్ ప్రొఫెసర్ ఎర్ల్ మిల్లర్'అభిజ్ఞా క్షీణతా నికర తుఫాను'గా అభివర్ణించాడు. అందుకే ఫ్రాన్స్, ఇటలీ, పోర్చుగల్ దేశాల్లో పాఠశాల ఆవరణల్లో మొబైల్ ఫోన్ల వాడకాన్ని నిషేధించారు.

బ్రిటన్ కూడా ఇదే నిర్ణయం తీసుకోనుంది. మిగతా దేశాలు యూరవునే అనుసరించనున్నట్టు సమాచారం. పిల్లల్నీ పెద్దల్నీ చదువుల్లోనే కాదు, ప్రతి చోట ప్రతి పనిలో ఏదో రకంగా శ్రద్ధాసక్తులకు దూరంగా కొనిపోతున్న ఈ విద్యున్మాధ్యమ ప్రసారికలను నిషేధించాలా? నియంత్రించాలా? అనే విషయంలో మీడియా నిపుణులు 'నియంత్రణ' కే తమ సమ్మతి తెలుపుతున్నారు. ఏకాగ్రతను శ్రద్ధాసక్తులు పెంపుదలకు విద్యాలయాలు ఏం చేయాలి? పిల్లలకు ఏరకమైన మద్దతు ఇవ్వగలం? అనే సూటి ప్రశ్నకు సమాధానం ఇస్తూ ప్రముఖ పాత్రికేయులు మేఘా చతుర్వేది 'విద్యాసమాచారంతో అనుసంధానం, బైట్–సైజ్ లెర్నింగ్‌ని అమలు చేయడం, ట్రిగ్గర్‌లను గుర్తించడం, అవధాన పూర్వక ప్రణాళికా వ్యూహాలు పాటించడం, డికంప్రెషన్ పాజ్‌ల అమలు, నానో లెర్నింగ్ వంటి పద్ధతుల్లో శ్రద్ధాసక్తులను రగిలించవచ్చు' అంటారు. అమెరికాలోని ఒరెగాన్ హెల్త్ & సైన్స్ యూనివర్శిటీ ప్రొఫెసర్ జోయెల్ టి నిగ్ చెపుతున్న దాన్ని బట్టి చూస్తే శ్రద్ధాసక్తుల కొరత పిల్లల్ని పోనుపోను 'శ్రద్ధా పూర్వక వ్యాధి కారక సంస్కృతి' లోకి నెట్టే ప్రమాదం పొంచి వుందనిపిస్తుంది. ఈ ప్రమాదాన్ని అధిగమించే కాలిఫోర్నియాకు చెందిన ప్రొఫెసర్ మిహాలీ విద్యార్థుల 'ఆనందమయ స్థితులు' గురించి సానుకూల మనస్తత్వశాస్త్ర రంగంలో నలభై సంవత్సరాలకు పైగా పరిశోధన చేస్తున్నాడు. శ్రద్ధా పునరుద్ధరణకై ఈయన యువతకు చిట్కా ఇస్తూ– 'పిల్లలూ! అనవసరాల ఆన్‌స్క్రీన్ కలాపాలకు స్వస్తిపలికి మీరు ప్రవహించాల్సిన చోట్లు మూడున్నాయి. వాటిని అనుసరించండి. అవి మొదట మీరు ఒక లక్ష్యాన్ని ఎంచుకోవడం, ఆ లక్ష్యం మీకు అర్థవంతంగా ఉండటం, మీరు చేస్తున్న కార్యక్రమాన్ని మీ సామర్థ్యానికి దాపున ఉంచుకొని అది మీకు సహాయపడేలా చూసుకోవడం– ఎట్లా అంటే మీరు ఎక్కే మెట్టు, మీరు ఎక్కిన చివరి మెట్టు కంటే కొంచెం ఎత్తుగా గట్టిగా ఉండటం' అన్నాడు.

# విషాదం మిగిల్చిన యుద్ధం

4.4 కోట్ల జనాభా కలిగిన ఉక్రెయిన్‌పై రష్యా ముప్పేట దాడితో ప్రారంభమైన భీకర యుద్ధం గత ఏడాదిగా కొనసాగుతూనే ఉన్నది. ఇరుపక్షాలు అపార ఆస్తి, ప్రాణ నష్టాలను చవిచూస్తూనే ఉన్నాయి. యుక్రెయిన్ దేశంలో యుద్ధం మిగిల్చిన విధ్వంసంతో 138 బిలియన్ యూయస్ డాలర్ల మౌళిక సదుపాయాలు బుగ్గిపాలు కావడం, లక్షల మంది పౌరులు నిరాశ్రయులు కావడం, శరణార్థులుగా పొరుగు దేశాలకు/ప్రాంతాలకు వలసలు వెళ్లడం జరుగుతున్నది. ఈ భీకర యుద్ధంలో దాదాపు 3 లక్షల వరకు రష్యన్ సైనికులు క్షతగాత్రులు కాగా దాదాపు 60,000 మంది మరణించడం జరుగగా, ఉక్రెయిన్ పక్షాన 1.2 లక్షలకు పైగా సైనికులు గాయపడడం/మరణించడం, 70,000లకు పైగా పౌరులు కూడా ప్రాణాలు కోల్పోవడం జరిగింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రారంభించిన ఏకపక్ష యుద్ధంతో ఉక్రెయిన్ పక్షాన యూయస్, యూరోప్ పశ్చిమ దేశాలు నిలుస్తూ అన్ని రకాలుగా ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి సహాయం చేస్తూ రష్యా దాడిని గత ఏడాది కాలంగా నిలువరించడంలో దోహదపడుతూ ఉన్నారు. ఈ యుద్ధంతో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం, ఆహార అభద్రత, ఇంధన కొరత, పర్యావరణ విచ్ఛిన్నం, ఆర్థిక సంక్షోభం లాంటి సమస్యలు ఉత్పన్నం కావడం జరుగుతున్నది. ఉక్రెయిన్ రష్యా యుద్ధానికి ఏడాది పూర్తి అయిన సందర్భంగా 23 ఫిబ్రవరి 2023 నిర్వహించిన 193- సభ్యత్వం కలిగిన ఐరాస 11వ అత్యవసర ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో రష్యా దాడిని ఖండిస్తూ యుద్ధం ముగియడానికి రష్యా బలగాలు బేషరతుగా సత్వరమే వెనక్కి తగ్గాలని కోరుతూ తీర్మానం చేశారు. ఈ సమావేశంలో 141 దేశాలు యుద్ధ అంతానికి రష్యా బేషరతుగా, వెంటనే వెనక్కి తగ్గాలని కోరగా తీర్మానించగా, 07 దేశాలు (బెలారస్, కొరియా, ఎరిట్రియా, మాలి, నికారగువా, రష్యా, సిరియా) వ్యతిరేకించగా, 32 దేశాలు ఓటింగుకు హాజరు కాలేదు. ఓటింగుకు హాజరు కాని దేశాల్లో ఇండియా, చైనా లాంటి దేశాలు ఉండడం విశేషం. ఓటింగుకు దూరంగా ఉన్న ఇండియా కూడా యుద్ధం త్వరగా అంతం కావాలని ఇరుపక్షాలను కోరడం మనకు తెలుసు. ఈ ఐరాస తీర్మానానికి ఎలాంటి చట్టబద్ధత లేనప్పటికీ అధిక దేశాలు యుద్ధ ముగింపును కోరుకుంటున్నట్లు తెలుస్తున్నది. భద్రతా మండలిలో రష్యా, చైనా లాంటి దేశాల వీటో పవర్‌తో యుద్ధ అంతానికి ఐరాస ప్రయత్నాలు నిర్వీర్యం అవుతున్నాయి. పుతిన్ పుర్రెలో తిరిగిన దాడి పురుగు కారణంగా ఉక్రెయిన్‌ను ఆక్రమించాలనే దుస్సాహసానికి వ్యతిరేకంగా యుద్ధం ఏడాది కాలంగా కొనసాగడం, ఉక్రెయిన్ ప్రతిఘటనకు (యూయస్, యూరొప్ దేశాలు చేయూతనిస్తూ) రష్యా బలగాలు అపార నష్టాలను చవిచూడడం, దిక్కుతోచని దుస్థితిలో రష్యా యుద్ధం కొనసాగించడం జరుగుతున్నది. ఉక్రెయిన్‌పై రష్యా దాడిని సమర్థించుకుంటున్న అధ్యక్షుడు పుతిన్ మాట్లాడుతూ ఈ యుద్ధం కొనసాగడానికి అమెరికా నేతృత్వంలోని పశ్చిమ దేశాలే కారణమని, తమ భూభాగాలను పొందడానికి మాత్రమే ఈ పోరాటం చేస్తున్నామని వాదిస్తున్నారు. మా పోరాటంలో మా మిత్రుడైన చైనా కూడా తమ వైపు నిలబడి చేయూతను ఇస్తున్నట్లు తెలుపుతున్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధంలో ఎన్నటికీ మాస్కో గెలవడం అసాధ్యమని యూరొప్ దేశాలు రష్యాను హెచ్చరిస్తున్నాయి. కొద్ది రోజుల్లో/వారాల్లో ముగియవచ్చనుకున్న యుద్ధం వీరోచిత ఉక్రెయిన్ ప్రతిదాడులతో ఏడాది పాటు కొనసాగడం, అపార నష్టాలను ఇరు దేశాలు చవిచూడడం, ప్రపంచ దేశాలు పలు తీవ్ర ప్రభావాలను ఎదుర్కోవడం జరుగుతున్నది. పుతిన్, జెలెన్‌స్కీలు వెనక్కి తగ్గకుండా సై అంటే సై అంటూ కాలుదువ్వడం, యుద్ధాన్ని భీకర స్థాయిలో కొనసాగించడం చూస్తున్నాం. ఉక్రెయిన్ గెలిస్తే అంతర్జాతీయ వేదికల్లో రష్యా ప్రాబల్యం తగ్గడం, రష్యా గెలిస్తే నాటో కూటమితో కొత్త వివాదాలు తలెత్తే అవకాశమే కాకుండా మరికొన్ని యుద్ధాలను ప్రపంచం చూడవచ్చని ఊహిస్తున్నారు. అమెరికా మిత్రదేశాలు అందిస్తున్న ఆయుధాలు, టెక్నాలజీ, ఆర్థిక సహాయంతో ఉక్రెయిన్ యుద్ధాన్ని కొనసాగిస్తున్నది. ఈ సహాయం ఎన్ని రోజులు దొరుకుతుందో తెలియదు. ఎంతటి సమస్యలను అయినా ప్రజాస్వామ్యయుత చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చని, ప్రపంచ దేశాలతో పాటు ఐరాస కూడా ఈ దిశగా ఇరుపక్షాలను అంగీకరింపజేసి, మధ్యేమార్గంగా రాజీ కుదిర్చి ప్రపంచ శాంతి స్థాపన దిశగా పటిష్ట అడుగులు చేయాలని పౌర సమాజం కోరుకుంటున్నది. అలసిన ఆర్థికంగా చితికి పోయిన ఇరుదేశాలు నేడు యుద్ధ అంతానికి మార్గాలను వెతికి పోరుకు చరమ గీతం పాడాలి. ఈ రెండు దేశాల కృపక్షాన నిలిచిన దేశాలు కూడా సంధి ద్వారాలను వెతకాలి. ఉక్రెయిన్ జెలెన్స్కీ, రష్యా పుతిన్‌లు యుద్ధ గాయాలకు లేపనాలద్దుతూ మానవీయ కోణంలో పరిష్కారాలను శోధించాలి. యుద్ధాలు ఎన్నటికీ మారణహోమ గుండాలని గత యుద్ధ చరిత్రలు ఘోషిస్తున్నాయి.

ఇరుపక్షాలు అపార ఆస్తి, ప్రాణ నష్టాలను చవిచూస్తూనే ఉన్నాయి. యుక్రెయిన్ దేశంలో యుద్ధం మిగిల్చిన విధ్వంసంతో 138 బిలియన్ యూయస్ డాలర్ల మౌళిక సదుపాయాలు బుగ్గిపాలు కావడం, లక్షల మంది పౌరులు నిరాశ్రయులు కావడం, శరణార్థులుగా పొరుగు దేశాలకు/ప్రాంతాలకు వలసలు వెళ్లడం జరుగుతున్నది. ఈ భీకర యుద్ధంలో దాదాపు 3 లక్షల వరకు రష్యన్ సైనికులు క్షతగాత్రులు కాగా దాదాపు 60,000 మంది మరణించడం జరుగగా, ఉక్రెయిన్ పక్షాన 1.2 లక్షలకు పైగా సైనికులు గాయపడడం/మరణించడం, 70,000లకు పైగా పౌరులు కూడా ప్రాణాలు కోల్పోవడం జరిగింది.

# తిరిగి ఎన్నికైన 12 మంది ఎంపిలపై క్రిమినల్ కేసులు

న్యూఢిల్లీ: 2004 నుంచి 2019 మధ్య తిరిగి ఎన్నికైన 23 మంది ఎంపిల్లో 12 మందిపై క్రిమినల్ కేసులున్నాయని ఎన్నికల సంబంధిత డేటాను విశ్లేషించే సంస్థ 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్' (ఎడిఆర్) శుక్రవారం వెల్లడించింది. ఈ 12 మందిలో తొమ్మిది మంది ఎంపిలపై హత్య, హత్యాయత్నం, దోపిడీ సహా తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయని పేర్కొంది. 2004-2019 మధ్య అభ్యర్థుల ఎన్నికల అఫిడవిట్‌లను విశ్లేషించి ఈ నివేదికను రూపొందించినట్లు తెలిపింది. జాబితాలో చేర్చబడిన 23 మంది ఎంపిలలో 52 శాతం మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, 39 శాతం మంది ఎంపిలపై తీవ్రమైన క్రిమినల్ కేసులు నమోదయ్యాయని పేర్కొంది. పార్టీల వారీగా గణాంకాలను కూడా ఈ నివేదికలో సమర్పించారు. బిజెపికి తిరిగి ఎన్నికైన 17 మంది ఎంపిలలో ఏడుగురు (41 శాతం), ముగ్గురు కాంగ్రెస్ (100 శాతం) ఎంపిలు క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్నారు.



# హర్యానా పోలీసుల దాష్టీకం



న్యూఢిల్లీ: యువరైతును అమానుషంగా పొట్టన పెట్టు కున్న హర్యానా పోలీసులు శుక్రవారం మరోసారి రైతులపై దాడి చేశారు. హర్యానాలోని హిస్సార్ జిల్లా నార్నౌండ్ సబ్ డివిజన్‌లో ఖేరీ చోప్తా వద్ద నిరసన తెలుపుతున్న రైతులపై పోలీసులు లాఠీచార్జి చేశారు. ఈ దాడిలో పలువురు రైతులు గాయపడ్డారు. ఖాప్ పంచాయతీలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతులు ట్రాక్టర్లతో పరేడ్ నిర్వహిస్తుండగా, పోలీసులు అడ్డుకోడానికి యత్నిం చారు. ఈ సందర్భంగా తోపులాట జరిగింది. ఎలాంటి హెచ్చరిక లేకుండానే పోలీసులు లాఠీలతో విరుచుకుపడ్డారు. రైతులపైకి డ్రోన్లతో విష రసాయనాలతో కూడిన టియర్ గ్యాస్ షెల్స్, రబ్బర్ బులెట్లు, పెల్లెట్ గన్స్ ప్రయోగించిన ఘనత హర్యానాలో బిజెపి ప్రభుత్వానిదే. యువరైతును కాల్చి చంపి 48 గంటల్లోనే మరో రైతు గుండె ఆగి చనిపోయాడు. దీంతో ఈ ఉద్యమంలో మరణిం చిన రైతుల సంఖ్య అయిదుకు చేరింది. ఫిబ్రవరి 13 నుండి ఖానౌరీ సరిహద్దు వద్ద నిరసనల్లో పాల్గొంటూ వస్తున్న భటిండా జిల్లా అమర్‌పురా గ్రామానికి చెందిన 62 ఏళ్ల రైతు దర్శన్ సింగ్ శుక్రవారం మరణించారు. అంబాలా జిల్లాకు చెందిన కొంతమంది రైతు నాయకులపై జాతీయ భద్రతా చట్టం (నాసా యాక్టు)ను ప్రయోగించారు. రైతు సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో వెనక్కి తీసుకున్నారు. నిరసన సందర్భంగా ప్రభుత్వ ఆస్తులకు ఎలాంటి నష్టం వాటిల్లినా రైతులే దానికి బాధ్యత వహించాలని హర్యానా పోలీసులు బెదిరించారు. నిరసనలు తెలిపేందుకు ముందస్తు అనుమతి తప్పనిసరి అంటూ రైతు నాయకుల ఇళ్లకు నోటీసు అతికించారు. బికెయు (షహీద్ భగత్ సింగ్) అధ్యక్షుడు అమర్జీత్ సింగ్ మొహ్రీ ఇంటికి కూడా పోలీసులు ఇదే తరహా నోటీసు అతికించారు. పంజాబ్‌లోని ఖానౌరీ సరిహద్దులో యువ రైతు శుభకరన్ సింగ్‌ను బలిగొన్న హర్యానా ప్రభు త్వ చర్యకు వ్యతిరేకంగా ఎస్‌కెఎం ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం దేశవ్యాపితంగా బ్లాక్ డే పాటిం చారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అమిత్ షా, హర్యానా ముఖ్యమంత్రి ఎంఎల్ ఖట్టర్, హర్యానా రాష్ట్ర హొం మంత్రి అనిల్ విజ్ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. గ్రామాలు, పట్టణా ల్లో విస్తృతంగా కాగడా ప్రదర్శనలు నిర్వహించారు. మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బెంగాల్‌లో సెక్స్ రాకెట్



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లోని హౌరా జిల్లాలో సెక్స్ రాకెట్ వ్యవహారం కలకలం రేపుతోంది. బిజెపి స్థానిక నేత సవ్యసాచి ఘోష్ ఈ రాకెట్‌కు కీలకసూత్రధారిగా వ్యవహరించినట్లు వెలుగులోకి వచ్చింది. దీంతో ఆయనతో పాటు మరో 10 మందిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. హౌరా జిల్లాలోని ఒక హొటల్‌ను కేంద్రంగా చేసుకొని ఈ సెక్స్ రాకెట్ నడుపుతున్నట్లు సీనియర్ పోలీసు అధికారి శుక్రవారం తెలిపారు. కోర్టు వీరిని వారం రోజుల పాటు పోలీసు కస్టడీకి అప్పగించింది. అదే సమయంలో దుండగుల బారి నుంచి పలువురు బాలికలు, యువతులను కూడా కాపాడినట్లు చెప్పారు. మరోవైపు సెక్స్ రాకెట్ నడుపుతున్న కాషాయ నేతలను కాపాడేందుకు బిజెపి యత్నిస్తోందని రాష్ట్రంలోని అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. అయితే తృణమూల్ నేతలు దారుణాలకు పాల్పడిన సందేశ్‌ఖలి సంఘటనల నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఈ వ్యవహారాన్ని తృణమూల్ ముందుకు తెస్తోందని బిజెపి నేతలు ప్రత్యారోపణలు గుప్పించింది. అక్రమాలు, అవినీతి మయంలో మునిగిన ఈ రెండూ పార్టీలనూ తిరస్కరించాలని మరోవైపు వామపక్షాలు, ఇతర పార్టీలు ప్రజలను కోరుతున్నాయి.


# ఇక మా నియంత్రణలోనే గాజా

టెల్ అవీవ్: ఒకవైపు కాల్పుల విరమణ కోసం చర్చలు పారిస్‌లో జోరందుకుంటున్న వేళ, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు గురువారం కీలక పత్రాన్ని తన వార్ కేబినెట్ ముందు ఉంచారు. ఈ పత్రంలో ప్రస్తుతం హమాస్‌తో జరుగుతున్న యుద్ధం ముగిసిన తర్వాత గాజాను ఎలా నియంత్రించాలన్న ప్రణాళికను వివరించారు. గాజాను నిస్సైనికీకరణ చేస్తామని, భద్రతతో పాటు పాలనా వ్యవహారాలను కూడా తమ చేతుల్లో తీసుకుంటామని పేర్కొన్నారు. వెస్ట్ బ్యాంక్, గాజా సహా జోర్డాన్ పశ్చిమభాగంలో భద్రతా నియంత్రణ మొత్తం ఇజ్రాయెల్ చేతిలో ఉంటుందని ప్రతిపాదించారు. పాలస్తీనాను ప్రత్యేక ప్రాంతంగా గుర్తించడాన్ని నెతన్యాహు తోసిపుచ్చారు. పాలస్తీనియన్లతో పరిష్కారం అనేది రెండు పక్షాల మధ్య ప్రత్యక్ష చర్చల ద్వారానే సాధ్యపడుతుందని చెప్పారు. అయితే, పాలస్తీనియన్ల వైపు ఎవరు ఈ చర్చలకు ప్రాతినిధ్యం వహిస్తారనే విషయాన్ని వెల్లడించలేదు. రఫా క్రాసింగ్‌తోపాటు స్థానికంగా స్మగ్లింగ్ ప్రయత్నాలను అడ్డుకునేందుకు ఈజిప్టు, అమెరికాలకు సహకరిస్తామన్నారు. గాజాలో శాంతిభద్రతలను కాపాడుతూ హమాస్ పాలనను భర్తీ చేసేందుకు స్థానిక ప్రతినిధులతో కలిసి పనిచేస్తామని సూచించారు. అయితే, ఉగ్రవాద దేశం లేదా గ్రూపులతో సంబంధం లేనివారితోనే కలిసి నడుస్తామని పేర్కొన్నారు. ఐరాస




నేతృత్వంలోని పాలస్తీనా శరణార్థి ఏజెన్సీని మూసివేయాలని.. దాని స్థానంలో ఇతర అంతర్జాతీయ సహాయ బృందాలను కొనసాగించాలని నెతన్యాహు తన ప్రతిపాదనలో పేర్కొన్నారు. మరోవైపు హమాస్-ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కోసం ప్రయత్నాలు జోరందుకున్నాయి. పారిస్‌లో చర్చలు జరుగుతున్నాయి. ఇందులో అమెరికా, ఈజిప్టు, ఖతర్ కీలక పాత్ర పోషిస్తున్నాయి. రంజాన్‌లోపు ఈ ఒప్పందాన్ని ఒక కొలిక్కి తేవాలని అవి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.

# నెరుడా మృతిపై మళ్లీ దర్యాప్తు అప్పీల్స్ కోర్టు ఆదేశం



**శాంటియాగో :** చిలీలో 1973లో సైనిక కుట్ర చోటు చేసుకున్న కొద్ది రోజుల తర్వాత సంభవించిన నోబెల్ బహుమతి గ్రహీత పాబ్లో నెరుడా మృతిపై మళ్లీ దర్యాప్తు జరపాలని అప్పీల్స్ కోర్టు రూలింగ్ ఇచ్చింది. ఈ కమ్యూనిస్టు యోధుడు, సుప్రసిద్ధ సాహితీవేత్త మృతికి దారి తీసిన పరిస్థితులు స్పష్టం కావడానికి తాజా ఆదేశం దోహదడుతుందని న్యాయస్థానం పేర్కొంది. నెరుడా మరణ ధ్రువీకరణ పత్రంలో నమోదు చేసిన కేన్సర్ కాకుండా ఇతర కారణాలను కూడా పరిశీలించేందుకు కేసును తిరిగి తెరవాల్సిందిగా నెరుడా మేనల్లుడు రొడాల్ఫ్ రీయాస్ గత డిసెంబరులో కోర్టును ఆశ్రయించారు. అయితే న్యాయమూర్తి దాన్ని తిరస్కరించారు. ఆయనపై విష ప్రయోగం జరిగిందనడానికి సాక్ష్యాధారాలున్నాయని కెనడా, డెన్మార్క్, చిలీలకు చెందిన నిపుణులు కనుగొన్నారని రీయాస్ తెలిపారు. నెరుడా శరీరంలో పెద్ద మొత్తంలో విష పదార్థం వుందని డానిష్, కెనడా ప్రయోగశాలల్లో జరిగిన పరీక్షల్లో తెలిసింది. ఈ విషం వల్ల ఆయన నాడీ వ్యవస్థ మొత్తం కుప్పకూలిందని రీయాస్ పేర్కొన్నారు. ఆయనపై విష ప్రయోగం జరిగిందంటూ ఆయన డ్రైవర్ దశాబ్దాల తరబడి ఘోషిస్తూనే వున్నారు. దీనిపై ఇరువైపులా వాదనలు విన్న అప్పీల్స్ కోర్టు కింది కోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేసి, ఈ కేసుపై తిరిగి దర్యాప్తు చేయాలని ఆదేశించింది.

# రెయిలింగ్‌ను ఢీకొట్టిన బస్సు....!




గుజరాత్ : రెయిలింగ్‌ను బస్సు ఢీకొట్టి లోయలోపడటంతో ఇద్దరు మృతి చెందిన ఘటన శనివారం గుజరాత్‌లో జరిగింది. ప్రయాణీకులతో వెళుతున్న బస్సు ఖేడా జిల్లాలోని నడియాద్ ప్రాంతంలో అదుపుతప్పి 25 అడుగులు కిందనున్న ప్రదేశంలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మీడియాకు అందిన సమాచారం ప్రకారం.. అహ్మదాబాద్-వడోదర ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రయాణీకులతో వెళుతున్న ఒక బస్సు రోడ్డు పక్కన ఉన్న రెయిలింగ్‌ను బలంగా ఢీకొని 25 అడుగులు కిందికి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారని, పలువురు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ఎస్పీ సహా పోలీసు సిబ్బంది సంఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపడుతున్నారు. ఎస్పీ రాజేష్ గఢియా మీడియాతో మాట్లాడుతూ.. ప్రమాదానికి గురైన బస్సు అహ్మదాబాద్ నుంచి పూణె వెళుతోందని తెలిపారు. బస్సులో దాదాపు 23 మంది ప్రయాణికులు ఉన్నారు. హైవేపై అకస్మాత్తుగా ఎడమవైపు నుంచి వచ్చిన సిమెంట్ ట్యాంకర్.. బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సు అదుపు తప్పి, రెయిలింగ్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదానికి కారణమైన ట్యాంకర్ డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశామన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మీడియాకు అందిన సమాచారం ప్రకారం.. అహ్మదాబాద్-వడోదర ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రయాణీకులతో వెళుతున్న ఒక బస్సు రోడ్డు పక్కన ఉన్న రెయిలింగ్‌ను బలంగా ఢీకొని 25 అడుగులు కిందికి పడిపోయింది.

# రోజూ ఈ డ్రింక్ తాగితే డాక్టర్ అవసరం ఉండదు.....?

ప్రతిరోజూ పాలు తాగడం వల్ల శరీరంలో ఈ మార్పులు చోటుచేసుకుంటాయి. ఇది విటమిన్స్, కాల్షియం, పోటాషియం, మెగ్నీషియం, జింక్ తో పాటు అనేక పోషకాలను కలిగిన ఉంది.పాలు ఒక సంపూర్ణ ఆహారం.రోజూ పాలు తాగడం వల్ల ఎముకల్లో బలం చేకూరుతుంది.బరువు తగ్గడం లో పాలు ఎంతగానో సహాయపడతాయి. రోజూ పడుకునే ముందు గోరువెచ్చని పాలు ఒక గ్లాస్ తాగితే మంచి ఫలితం ఉంటుంది.నిద్ర కూడా బాగా పడుతుంది.కండరాలు బలంగా తయారవుతాయి.మగవారిలో శుక్రకణాలు మెరుగుపడటంలో మెరుగైనా బలమైన కణాలు తయారవడంలో సహాయపడుతుంది.హార్మోనల్స్ హెచ్చు తగ్గులని సరిచేసి సమానంగా ఉంచుతుంది.ప్రేగు సమస్యలు క్యాన్సర్ సమస్యలు ఉన్నవాళ్ళు డైలీ పాలుతాగడం వల్ల త్వరగా కోలుకుంటారాని కొంతమంది నిపుణుల పరిశీలనలో తెలిందిం.రోజూ ఈ డ్రింక్ తాగితే డాక్టర్ అవసరం ఉండదు.అయితే పాలే కాకుండా పాలతో తయారు చేసిన వాటిని తిన్నా కూడా మంచి ఫలితాలు ఉన్నాయి.అవేంటో చూద్దాం. పాలతో తయారయినా పెరుగు,పెరుగులో కాల్షియం,పాస్పరస్, మెండుగా ఉండటం వల్ల వయసు పైబడినా కూడా ఎముకుల విరుగుళ్ళు రాకుండా కాపాడుతుంది. వంటి సమస్యలకి,కంటి సమస్యలకి,పెరుగు చాలా మంచిది.సన్నగా ఉన్నామని చింతించే వారికి పెరుగు ఒక మంచి చిట్కాల కూడా ఉపయోగపడుతుంది. పెరుగన్నంలో అరటికాయ కలిపి తింటే మీరు వెయిట్ గేయిన్ అవ్వొచ్చు.పెరుగుని మజ్జిగలా చేసుకొని తాగడం వల్ల బెనిఫిట్స్ చాలా ఉన్నాయి.మజ్జిగలో చెక్కెర కలిపి తీసుకుంటే బాడీ హీట్ని తగ్గించి శరీరాన్ని చల్లబరుస్తుంది.బాడీ డిహైడ్రెషసన్ అదుపులో ఉంచుతుంది.ఆహారంలో వ్యర్థపదార్థాలని తొలగిస్తుంది.రోజూ మజ్జిగ తాగడం వల్ల మలబద్ధకం జీర్ణసమస్యలని నివారిస్తుంది.చర్మం ఆరోగ్యంగా పొడిబారకుండా సురక్షితంగా ఉంచుతుంది.జుట్టుకి పెరుగు మంచి పోషనగా ఉంటుంది.వారానికి రెండు సార్లు గుడ్డులోని తెల్లసొనకి పెరుగు జోడించి తలకి పెడితే జుట్టుకి మంచి సెక్యూరిటీ గా పనిచేస్తుంది.మంచి కండిషనర్ గా ప్రొటక్ట్ చేస్తుంది.



# పిల్లలకు పీచు మిఠాయి కొనిస్తున్నారా....




పిల్లల నుంచి పెద్దల వరకు ఎంతో ఇష్టంగా తినే పీచు మిఠాయి(కాటన్ క్యాండీ)లో ప్రాణాంతక క్యాన్సర్ కారకాలు బయటపడ్డాయి. చిన్నారులను ఆకర్షించేలా గులాబీ(పింకు), ఆకుపచ్చ రంగుల్లో లభించే ఈ కాటన్ క్యాండీని తింటే ప్రమాదాన్ని కొనితెచ్చుకున్నట్టేనని తాజా పరిశోధనల్లో తేలింది. ఈ కారణంతోనే తమిళనాడు ప్రభుత్వం తమ రాష్ట్రంలో పీచు మిఠాయి అమ్మకాలపై ఇటీవలే నిషేధం విధించింది. వీటి తయారీ, విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆరోగ్య మంత్రి వార్నింగ్ ఇచ్చారు. కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలోనూ కాటన్ క్యాండీపై నిషేధం అమల్లో ఉంది. పీచు మిఠాయిని అమెరికాకు చెందిన దంతవైద్యుడు విలియం మోరిసన్, మిఠాయి వ్యాపారి జాన్ సీ వార్టన్‌తో కలిసి 1897లో కనిపెట్టారు. దీనిని మొదట ఫెయిరీ ఫ్లాస్ అనే పేరుతో పిలిచేవారని తమిళనాడుకు చెందిన చెఫ్, ఆహార చరిత్రకారుడు రాకేష్ రఘునాథన్ తెలిపారు. అయితే, అప్పుడే పండించిన పత్తిలా తెల్లగా కనిపించడంతో, కాలక్రమేణా దాని పేరు కాటన్ క్యాండీగా మారిందని తెలిపారు. తొలినాళ్లలో కాటన్ క్యాండీ తయారీలో క్లోరోఫిల్ (ఆకుపచ్చ), కెరోటినాయిడ్ (పసుపు, నారింజ లేదా ఎరుపు), ఆంథోసైనిన్ (నీలం) వంటి మొక్కల ఆధారిత రంగులను ఉపయోగించేవారు. కానీ, ఈ రంగులు ఎక్కువకాలం ఉండకపోవడంతో అవి చూడ్డానికి ఆకర్షణీయంగా కనిపించేవి కాదు. ఈ క్రమంలోనే సింథటిక్ ఫుడ్ కలర్స్‌కు ఆదరణ పెరగడంతో వాటిని పీచు మిఠాయిలోనూ వాడారు. సింథటిక్ కలర్లను ఆహార భద్రత చట్టానికి లోబడి సరైన పరిణామంలో ఉపయోగిస్తే.. అది సురక్షితమైనదే.

# ఐరన్ లోపిస్తే మీ శరీరంలో జరిగేది ఇదే!



ఏ విషయంలోనైనా నెగ్లెట్ చేయవచ్చు కానీ ఆరోగ్యం విషయంలో అస్సలు నెగ్లెట్ చేయకూడదు అంటారు . మనం ఎంత ఆరోగ్యంగా ఉంటే అంత సంపద ఉన్నట్లే అంటారు మన పెద్దలు. ఇక మన శరీరానికి లభించాల్సిన ముఖ్యమైన పోషకాల్లో ఐరన్ ఒకటి. శరీరానికి ఐరన్ చాలా అవసరం. ఇది హిమోగ్లోబిన్ ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తుంది. కానీ కొంత మందిలో ఐరన్ సరిపడినంత ఉండదు. మరి ముఖ్యంగా గర్భిణీలు ఐరన్ సమస్యను అధికంగా ఎదుర్కొంటారు. అయితే మనం ఐరన్ లోపంతో బాధపడుతున్నాము అనే విషయాన్ని కొన్ని లక్షణాల ద్వారా తెలుసుకోవచ్చునంట. అవి ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. 1. ఐరన్ లోపంతో బాధపడే వ్యక్తులు బరువు తగ్గడమే కాకుండా చర్మం పాలిపోయినట్లుగా కనిపిస్తుంది. అలాగే వారి కాళ్లు చేతులు చల్లబడటం జరుగుతూ ఉంటుంది. 2. కాసేపు నడిస్తే అలసిపోవడం, మాటి మాటికి తల తిరిగినట్లు, మైకంగా అనిపిస్తే వారిలో ఐరన్ లోపం ఉన్నట్లేనంట. 3. ఐరన్ లోపం ఉన్న వారిలో రోగనిరోధక శక్తి చాలా వరకు తక్కువగా ఉంటుందంట. చాలా బలహీనంగా కనిపిస్తారు. 4. శరీరంలో ఐరన్ లెవెల్స్ తగినంతగా లేకపోతే రక్తంలో ఆక్సిజన్-వాహక సామర్థ్యం తగ్గుతుంది. దీంతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడుతుంది. శారీరక శ్రమ, బరువైన పనులు చేసే సమయంలో ఇది మరింత ఎక్కువగా ఉంటుంది. 5. శరీరంలో ఐరన్ లెవెల్స్ తగినంతగా లేకపోతే ఏకాగ్రత లోపిస్తుంది. ఏ పని మీద దృష్టి సారించలేరు. జ్ఞాపక శక్తి తగ్గిపోతుంది.

# మామిడి ఇలా తీసుకుంటే అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు?



మామిడికాయ ప్రియులకి సీజన్ వచ్చింది.ఇక పండగే పండగ.ఎండాకాలంలోనే దొరికే ఈ పండుని ఎంతో ఇష్టంగా తింటారు.ఈ పండుని ఇష్టపడని వాళ్ళు అంటూ ఉండరు.అందుకె పండ్లలో దీనికి ఒక ప్రత్యేక స్థానం ఉంది.ఇది మన భారతదేశపు జాతీయ ఫలం.

తినే పండ్లలో ఇది రాజు.వీటిలో అనేక రకాల పండ్లు ఉన్నాయి.ఈ పండులో విటమిన్ C పుష్కళంగా ఉంటుంది.అంతేకాదు కాల్షియం కూడ ఎక్కువే.ఇది శరీరంలో చెక్కెర స్థాయిని మెతుగుపరుస్తుంది.వేసవిలో సంభవించే అనారోగ్యాలు ఈ కాయ తినడం వల్ల దరి చేరవు.ఈ మామిడికాయ ముక్కలకి కాస్త ఉప్పు చల్లి ముక్కల్ని తింటే ఎండాకాలంలో అధిక దాహన్ని అదుపుచేయొచ్చు.విరోచనాలు మలబద్ధకంలాంటి సమస్యలని అరికట్టవచ్చు.ఇందులో ఉన్న విటమిన్ C వికారానికి వాంతులకి బాగా పని చేస్తుంది.గర్భిణీగా ఉన్నపుడు ఈ వికారానికి వాంతులకి మామిడికాయని తినడం ఒక మంచి చిట్కా అని చెప్పొచ్చు.ఇందులో మనకి కెరొటీన్ కూడా లభిస్తుంది.ఇందులో రకాలు కూడా ఉన్నాయి. బంగినపల్లిమామిడిపండు,రసాలు,చిన్నరాసలు,పెద్దరసాలు, చిత్తూరుమామిడి,కొబ్బరిమామిడి,సోరమామిడి,ఇలా పలురకాల పేర్లతో పిలుస్తారు.. వీటిని జ్యూస్ చేసి కూడా తీసుకుంటారు.ఒకే సీజన్ లో దొరికే ఈ కాయని నిల్వ పచ్చడిగా పెట్టుకొని సంవత్సరం పాటు తింటారు.ఈ ఆవకాయతో పెరుగన్నం బలే రుచిగా ఉంటుంది. వేడి వేడి అన్నంలో
ఆవకాయ పచ్చడితో తింటే ఆ రుచే వేరు.మామిడికాయతో పులిహొర చేస్తే రుచి ఎంతో అద్భుతంగా ఉంటుంది.

# కార్బోహైడ్రేట్లు తినకపోతే శరీరంలో ఎలాంటి మార్పులు వస్తాయో తెలుసా........?




ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారం పై శ్రద్ధ పెట్టాలి. మన శరీరానికి తగిన మోతాదులో పోషకాలు అందకపోతే, మనం వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుంది. విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్, ఐరన్ తో సహా అన్ని పోషకాలు శరీరానికి అవసరం. కానీ ఇవి కాకుండా, కార్బోహైడ్రేట్ కూడా మన ఆరోగ్యానికి చాలా ముఖ్యమైన పోషకం. ఇది శరీరానికి శక్తిని అందించేలా పనిచేస్తుంది. మధుమేహం లేదా బరువు పెరుగే సమస్యను ఎదుర్కొంటున్న వ్యక్తులు వారి ఆహారంలో కార్బోహైడ్రేట్లను చేర్చుకోరు. కానీ మనం తీసుకునే ఆహారంలో కార్బోహైడ్రేట్స్ లేకపోవడం వల్ల శరీరంలో కార్బోహైడ్రేట్ లోపం ఏర్పడుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీని వల్ల మన శరీరం అనేక సమస్యలను ఎదుర్కొంటుంది.

# ఒత్తిడికి కారణాలేంటో తెలుసా....?

బిజీ లైఫ్, స్టైల్ వల్ల చాలా మంది ఒత్తిడి వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. చిన్న చిన్న విషయాలకు కూడా ఒత్తిడికి లోనయ్యేంత సున్నితంగా మారారు.కొన్నిసార్లు ఈ ఒత్తిడి ఎంతగానో పెరిగి ఆత్మహత్యలకు కూడా ప్రయత్నిస్తారు. ఒత్తిడికి గురైన వ్యక్తి తనలో సతమతమవుతూ ఉంటారు. ఒత్తిడి మానసిక ఆరోగ్యం పైనే కాకుండా శారీరక ఆరోగ్యంపైన కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

నిరంతరం ఒత్తిడికి లోనవడం వల్ల అనేక శారీరక సమస్యలు తలెత్తుతాయి. అటువంటి పరిస్థితిలో మీరు మీ జీవనశైలిని మెరుగుపరచుకోవడం చాలా ముఖ్యం అంటున్నారు వైద్య నిపుణులు. మీ మానసిక ఆందోళన నుంచి బయటపడేందుకు కొన్ని జీవనశైలిలో కొన్ని మార్పులు తెచ్చుకోవాలని అంటున్నారు నిపుణులు. మరి ఆ మార్పులేంటో ఇప్పుడు తెలుసుకుందాం. మీరు మానసికంగా ఒత్తిడికి గురైతే ఎక్కువగా కుటుంబ సభ్యులతో మాట్లాడాలి. కుటుంబం లేదా స్నేహితులతో సమయం గడపకపోవడం వల్ల ఒత్తిడికి




లోనవుతారని మానసిక వైద్యనిపుణులు చెబుతున్నారు. ఒత్తిడి కూడా గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుందని అనేక పరిశోధనలు చెబుతున్నాయి. మీ మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడానికి కుటుంబంతో సమయాన్ని వెచ్చించండి. ఒక వ్యక్తి తనను తాను ఇతరులతో పోల్చుకోవడం ద్వారా చాలాసార్లు ఒత్తిడికి గురవుతారు. జీవితంలో ఏ సమయంలోనైనా వైఫల్యం రావచ్చు. అలాంటి పరిస్థితిలో మిమ్మల్ని మీరు మరొకరితో పోల్చుకుంటే ఒత్తిడి ప్రబలుతుంది.

# టిఫిన్ తిన్న వెంటనే టీ తాగుతున్నారా?



ప్రతి ఒక్కరు ఉదయాన్నే టీ తాగడానికి ఎక్కువ ఇంట్రెస్ట్ చూపిస్తుంటారు. తెల్లవారుజామున టీ తాగనిదే కొందరికి రోజే గడవ నట్లు ఉంటుంది. అయితే కొంత మంది పరగడుపున టీ తాగితే, మరికొందరు టిఫిన్ తిన్న వెంటనే టీ లేదా కాఫీ తాగుతుంటారు. అయితే ఇలా టిఫిన్ తిన్న వెంటనే టీ తాగడం ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదు అంటున్నారు ఆరోగ్య నిపుణులు. భోజనం చేసిన వెంటనే టీ తాగడం వలన ఇది శరీర ఆహారం నుంచి అవసరమైన పోషకాలను గ్రహించడంలో ఆటకం కలిగిస్తుందంట. అంతే కాకుండా ఇది తీవ్రమైన ఐరన్ లోపానికి దారితీస్తుందంట. దీని వలన అనీమియా సమస్య ఎదురయ్యే అవకాశం ఉందని అంటున్నారు ఆరోగ్య నిపుణులు. అందుకే ఉదయాన్నే తిన్న వెంటనే టీ తాగకూడదంట. ఇంకొంత మంది ఉదయం, సాయంత్రం తిన్న తర్వాత టీ తాగుతారు. ముఖ్యంగా మహిళలు అతిగా టీ తాగుతుంటారు. అయితే ఇలా అతిగా టీ తాగడం వలన మహిళలు నెలసరిలో సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉందని, అందువలన టీ ఎక్కువ తాగకూడదని చెబుతున్నారు నిపుణులు. అయితే కొంత మంది పరగడుపున టీ తాగితే, మరికొందరు టిఫిన్ తిన్న వెంటనే టీ లేదా కాఫీ తాగుతుంటారు. అయితే ఇలా టిఫిన్ తిన్న వెంటనే టీ తాగడం ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదు అంటున్నారు ఆరోగ్య నిపుణులు.

# ఇలా ఇడ్లీ చేసుకొని తింటే చాలా హెల్తీగా ఉంటారు?

ఇడ్లీ ఆరోగ్యానికి చాలా రకాలుగా మేలు చేస్తుంది.ఎందుకంటే దీని తయారీకి నూనె అవసరం లేదు.ఈ రకంగా ఆరోగ్యానికి చాలా ప్రయోజనం కలుగుతుంది.ఇడ్లీలో పీచుపదార్థం ఉంటుంది.దీనిని తరచుగా చట్నీలు లేదా సాంబార్‌లతో తింటారు.అలా శరీరానికి పీచు పదార్థం అందుతుంది.ఇడ్లీ సాధారణంగా గ్లూటెన్ రహిత ఆహారం. గ్లూటెన్ సెన్సిటివిటీ ఉన్నవారికి ఇది అనుకూలంగా ఉంటుంది.ఇడ్లీలో సహజంగా కొవ్వు తక్కువగా ఉంటుంది. ఇది గుండెకు ఆరోగ్యకరమైన ఎంపిక.ఇడ్లీల్లో ఫైబర్ కంటెంట్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను సులభతరం చేస్తుంది.ఇడ్లీలో ఉండే యాంటీ ఆక్సిడెంట్స్.. గుండె, లివర్ పనితీరును మెరుగుపరుస్తాయి. కావాల్సిన అమైనో యాసిడ్స్ సులభంగా అందుతాయి.జీర్ణ వ్యవస్థకు కూడా మేలు చేస్తుంది.ఇడ్లీని పులియబెట్టిన బియ్యం పిండితో తయారు చేస్తారు. ఇది కండరాల పెరుగుదలకు అవసరమైన ప్రోటీన్‌ను అందిస్తుంది.ఇడ్లీని పులియబెట్టడం వల్ల విటమిన్ బి లభ్యత పెరుగుతుంది. ఇక ఇడ్లీ కార్బోహైడ్రేట్లకు చాలా మంచిది.





# బికినీ లో అదర గొట్టిన సమంత

టాలీవుడ్ అగ్ర హీరోయిన్ సమంత మరోసారి సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. తరుచూ తన రొటీన్ లైఫ్ ఫొటోలను అభిమానులతో పంచుకునే సమంత తాజాగా విడుదల చేసిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో పెద్ద రచ్చనే లేపుతున్నాయి. ప్రస్తుతం మలేసియాలో ఓ గ్రాండ్ రిసార్ట్‌లో వేకేషన్ ఎంజాయ్ చేస్తున్న సమంత అక్కడ ఓ చిన్న పాండ్‌లో బికినిలో స్విమ్ చేస్తూ దిగిన ఫొటోలను తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయగా క్షణాల్లోనే తెగ వైరల్‌గా మారాయి. దీంతో చాలామంది హాలీడేస్ ఎంజాయ్ చేయండి అంటూ కామెంట్స్ పెడుతుండగా మరికొందరు సమంత ఏంటి విడాకుల తర్వాత రోజురోజుకు గ్లామర్ డోస్ పెంచుతుందంటూ నోరెళ్ల బెడుతున్నారు. ఇదిలాఉండగా అనారోగ్య సమస్యలతో ట్రీట్మెంట్ తీసుకున్న సమంత ప్రస్తుతం బయటి దేశాల్లో ఎక్కువగా గడుపుతూ విశ్రాంతి తీసుకుంటుంది. ఇక ఆమె తాజాగా నటించిన బాలీవుడ్ వెబ్ సిరీస్ సిటాడెల్ త్వరలో విడుదల కానుంది.



టిల్లు స్క్వేర్‌లో అనుపమ

# అందాల ఆరబోత

స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ అనుపమ పరమేశ్వరన్ హీరోహీరోయిన్లుగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తోన్న చిత్రం 'టిల్లు స్క్వేర్' మల్లిక్‌రామ్ దర్శకుడు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. ఈ సినిమా ఓటీటీ రైట్స్ రికార్డ్ ప్రైస్‌కు అమ్ముడయినట్లుగా తెలుస్తోంది. నెట్‌ఫ్లిక్స్ సంస్థ ఈ సినిమా ఓటీటీ హక్కులను రూ. 35 కోట్లకు సొంతం చేసుకున్నట్లుగా టాలీవుడ్ సర్కిల్స్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. ఇది నిజమైతే మాత్రం ఈ మధ్యకాలంలో ఏ యంగ్ హీరోకి లేని రికార్డ్‌ను సిద్ధు జొన్నలగడ్డ క్రియేట్ చేసినట్లే. ఎలా అంటే, ఈ మధ్య కాలంలో ఏ కుర్ర హీరో చిత్రానికీ ఈ రేంజ్‌లో హక్కులు అమ్ముడవలేదు. 'డీజే టిల్లు' సక్సెస్ తర్వాత వస్తున్న ఈ సీక్వెల్‌పై మంచి అంచనాలు అయితే ఉన్నాయి కానీ.. ఈ రేంజ్‌లో ఓటీటీ హక్కులు అమ్ముడవుతాయని మాత్రం ఎవరూ ఊహించి ఉండరు. అందుకు కారణం మాత్రం అనుపమ అందాలే అని చెప్పుకోవాలి. ఇప్పటి వరకు పక్కింటి అమ్మాయిలా కనిపించిన అనుపమ.. ఈ సినిమా విషయంలో మాత్రం ఓ రేంజ్‌లో రెచ్చిపోయి కనిపిస్తోంది.




# ముగ్గురు భామల క్రూ

బాలీవుడ్ భామలు టబు, కరీనా కపూర్ ఖాన్, నేషనల్ అవార్డు విన్నర్ కృతిసనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'క్రూ'. లూట్‌కేస్' ఫేమ్ రాజేష్ కృష్ణన్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాను ఏక్తాకపూర్, రియాకపూర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాను మార్చి 29న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే తాజాగా ఈ మూవీ నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ ముగ్గురు ఎయిర్ హోస్టెస్ గెటప్‌లో కనిపిస్తున్నారు. టబుతో ప్రమాదం అని, కరీనాను దొంగ అని, కృతి సనన్‌ను నకిలీ అని పోస్టర్స్‌కు క్యాప్షన్ ఇవ్వడం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఎయిర్‌హోస్టెస్‌గా పనిచేస్తున్న ముగ్గురు మహిళల జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రమిది. ఇక ఈ చిత్రంలో పంజాబీ యాక్టర్ దిల్జీజ్ దోసాంజ్, కపిల్ శర్మ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.




# నాని 'సరిపోదా శనివారం' గ్లింప్స్ విడుదల.. టైటిల్ సీక్రెట్ ఇదే

నాని హీరోగా వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో 'సరిపోదా శనివారం' పాన్ ఇండియా రేంజ్‌లో తెరకెక్కుతోంది. 'అంటే సుందరానికీ' సినిమా తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో ఈ సినిమా తెరకెక్కుతుంది.ప్రియాంకా అరుళ్ మోహనన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ఎస్‌జే సూర్య ఓ కీలక పాత్రలో పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నాడు. డీవీవీ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై డీవీవీ దానయ్య ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నాడు. ఆగష్టు 29న ఈ చిత్రం విడుదల కానుంది.నేడు నాని పుట్టినరోజు సందర్భంగా 'సరిపోదా శనివారం' మూవీ నుంచి గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్.. ఇందులో నాని యాంగ్రీమెన్‌లా కనిపిస్తున్నాడు. ఎస్ జే సూర్య వాయిస్‌తో గ్లింప్స్ ప్రారంభం అవుతుంది. వారం మొత్తంలో శనివారం మాత్రమే హీరో నానిలో కోపం కట్టలు తెంచుకుంటుంది. దీనినే ఈ గ్లింప్స్‌లో చూపించారు.వారంలో అన్ని రోజుల్లో సాదాసీదాగా ఉంటూ.. శనివారం మాత్రమే శక్తిమంతుడిగా కనిపించే హీరో కథగా ఈ మూవీ ఉండనుంది. యాక్షన్‌కు.. వినోదానికి ఇందులో పెద్ద పీట వేసినట్లు తెలుస్తోంది. నాని క్యారెక్టర్ డిజైన్ చాలా ఫ్రెష్ గా ఉంది. గ్లింప్స్‌లో డైలాగ్స్ లేకపోయినా అతని స్క్రీన్ ప్రెజెన్స్ అద్భుతంగా ఉంది. నాని సిగరెట్ తాగే విధానం పాత్రకు చైతన్యాన్ని తెస్తుంది. వెనుక సీటులో అజయ్ ఘోష్ కూర్చొని ఉండగా నాని రిక్షా తొక్కే సన్నివేశం మెచ్చుకోదగినది. గ్లింప్స్‌తో ఫ్యాన్స్‌ను నాని మెప్పించాడని చెప్పవచ్చు.

# ఆపరేషన్ వాలంటైన్ విజయం కోసం వరుణ్ ఎదురుచూపు

విజయం కోసం పరితపిస్తున్న యువనటుల్లో మెగా కుటుంబం నుండి వచ్చిన వరుణ్ తేజ్ ఒకరు. వరుణ్ కి ఒక మంచి బ్రేక్ వచ్చి చాలా సంవత్సరాలు అయింది. ఐదేళ్ల క్రితం చేసిన 'గద్దలకొండ గణేష్' అనే సినిమా పరవాలేదు బాగానే ఆడింది అని అన్నారు, అంతే ఆ తరువాత వరుణ్ కొన్ని సినిమాలు చేసినా విజయం మాత్రం వరించలేదు. ఆ సినిమా తరువాత పాండెమిక్ రావటం, కొంచెం విరామం తీసుకోవటం జరిగింది. 'గద్దలకొండ గణేష్' చేసిన మూడేళ్ళ తరువాత 'ఘని' అని బాక్సింగ్ నేపథ్యంలో వచ్చిన సినిమా చేశారు, కానీ అది తీవ్ర నిరాశే మిగిల్చింది. విడుదలైన రెండో రోజుకే ఆ సినిమాని కొన్ని థియేటర్స్ నుండి తీసేసారు. ఆ తరువాత వరుణ్ ఎక్కువ సినిమాలు ఒప్పుకోలేదు అనే చెప్పాలి. ఆ తరువాత వచ్చిన 'ఈ3: ఫన్ అండ్ ఫ్రస్టేషన్' ముందు వచ్చిన 'ఎఫ్ 2' కి సీక్వెల్ గా వచ్చింది. ఇందులో వెంకటేష్ ఇంకో కథానాయకుడిగా వేశారు, కానీ ఈ సినిమా మొదటి సినిమా అంత విజయం సాధించలేదనే చెప్పాలి. గత సవంత్సరం 'గాండీవధారి అర్జున' అనే గూఢచారి, యాక్షన్ నేపథ్యం వున్న సినిమా చేశారు. ప్రవీణ్ సత్తారు
దీనికి దర్శకుడు. అయినా ఈ సినిమా కూడా డిజాస్టర్ గా నిలిచింది. గత సంవత్సరం తన సహచరి నటి లావణ్య త్రిపాఠి ని వివాహం చేసుకున్నారు. ఇప్పుడు 'ఆపరేషన్ వాలెంటైన్' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఇది తెలుగు, హిందీ భాషల్లో విడుదలవుతోంది. ఇది ఎయిర్ ఫోర్స్ నేపథ్యంలో కొన్ని నిజ సంఘటనల ఆధారంగా మలిచిన చిత్రం అని చెపుతున్నారు. దీనికి హిందీ దర్శకుడు శక్తి ప్రతాప్ సింగ్ హడ దర్శకత్వం వహించారు. అయితే ఇది మరి తెలుగు ప్రేక్షకులకు ఆసక్తికరంగా ఉంటుందా అని ఒక చిన్న సందేహం అని పరిశ్రమలో టాక్. అలాగే ఈ సినిమా వార్ నేపథ్యం కూడా ఉంటుంది అని చెపుతున్నారు.ఇలాంటి నేపథ్యం వుండే సినిమాలు తీసేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి, ఇంతకు ముందు వరుణ్ తేజ్ 'అంతరిక్షం' అనే సినిమా ఒకటి చేశారు. కానీ ఇది ప్రేక్షకులకి అంతగా ఎక్కలేదు. మరి ఈ 'ఆపరేషన్ వాలెంటైన్' అనే సినిమా తెలుగు ప్రేక్షకులకి ఆసక్తికరంగా ఉంటుందా? ఎందుకంటే ఈ సినిమా టైటిల్ ఇంగ్లీష్ లో వుంది, మరి ఇలాంటి టైటిల్ పెడితే మాస్ ప్రేక్షకులు థియేటర్స్ కి వస్తారా అని ఒక సందేహం కూడా వుంది అని చర్చ. అదీ కాకుండా ఈమధ్య పాన్ ఇండియా కథలంటూ తెలుగు నటులు చాలామంది ప్రయత్నాలు చేశారు, కానీ ఎవరూ సఫలం కాలేదు. మరి వరుణ్ సినిమా ఎంతవరకు విజయం సాధిస్తుందో చూడాలి. ఈ సినిమా మార్చి 1 న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సినిమాకి ప్రచారాలు కూడా బాగానే చేస్తున్న వరుణ్ తేజ్ కి ఇప్పుడు ఒక మంచి విజయం కావాలి, అందుకోసం ఎదురుచూస్తున్నారు, ఈ 'ఆపరేషన్ వాలెంటైన్' అతనికి ఆ బ్రేక్ ఇస్తుందని ఆశిద్దాం!






గరుడ వార్త



# అక్కడ ఏటీఎం వాడితే బాదుడే బాదుడు....



విదేశాల్లో విహారయాత్రకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారా? కుటుంబంతో సహా ఇతర దేశాల్లో పర్యటించాలనుకుంటున్నారా? అయితే ఈ కథనం తప్పనిసరిగా చదవాల్సిందే.ఎందుకంటే సాధారణంగా మనం వేరే దేశాలకు పర్యటనకు వెళ్లే ముందు అక్కడి హోటళ్లు, రవాణా సౌకర్యాలు, భోజనం వంటి వాటిని తెలుసుకుంటాం. ఎలా వెళ్లాలి? ఖర్చులు అన్ని లెక్క చూసుకుంటాం. అదే సమయంలో మరో ముఖ్యమైన అంశం కూడా మనం చూసుకోవాల్సి ఉంటుంది. అదేంటంటే ఏటీఎం చార్జీలు. ఎందుకంటే చాలా దేశాల్లో ఏటీఎమ్ విత్‌డ్రా చార్జీలు ఎక్కువగా ఉంటాయి. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ విహారయాత్రల్లో డబ్బులు నష్టపోకుండా ఉండాలంటే దీని గురించి పూర్తిగా తెలుసుకోండి. ఫారిన్ ఎక్స్చేంజ్ ఫైనాన్సియల్ టెక్నాలజీ కంపెనీ ఇటీవల వెల్లడించిన విషయం ప్రకారం భారతీయ పర్యాటకుల నుంచి కొన్ని దేశాల అత్యధిక ఏటీఎం చార్జీలు వసూలు చేస్తున్నాయి. ఆసియా- పసిఫిక్ (ఏపీఏసీ) రీజియన్ పరిధిలోని పర్యాటక ప్రాంతాలకు సంబంధించి ఇచ్చిన నివేదిక ప్రకారం తుర్కియే (టర్కీ)లో ఏటీఎం చార్జీలు ఎక్కువగా ఉన్నాయి. ఈ దేశంలో దాదాపు 4.44% సొమ్మును ట్రాన్‌సెక్షన్ చార్జీలుగా వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం కొత్త సంవత్సరం మొదలైంది. చాలామంది భారీతీయులు అంతర్జాతీయ ప్రయాణాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వారందరూ ఏటీఎం చార్జీల వివరాలు తెలుసుకోవడం చాలా ముఖ్యం. కొద్దిపాటి అవగాహనతో సులభమైన, తక్కువ బడ్జెట్‌తో టూర్ ప్లాన్ వేసుకోవచ్చు. ఏపీఏసీ పరిధిలోని సుమారు 15 దేశాల్లో భారతీయుల నుంచి ఏటీఎం చార్జీలను ఎంత వసూలు చేస్తారో తెలుసుకుందాం. తుర్కియేలో 4.44, బూటాన్‌లో 3.16, నేపాల్‌లో 2.79, థాయిలాండ్‌లో 2.02, దక్షిణ కొరియాలో 2.55, వియత్నాంలో 1.85, సింగపూర్‌లో 1.41, జపాన్‌లో 0.64, శ్రీలంకలో 0.57. బంగ్లాదేశ్‌లో 0.46, ఇండోనేషియాలో 0.30, హాంకాంగ్‌ల 0.05, మలేసియాలో 0.03, చైనా మెయిన్‌లాండ్ 0.01 శాతంగా ఈ చార్జీలు ఉన్నాయి. ఉదాహరణకు మనం తుర్కియే వెళ్లినప్పుడు ఆదేశంలోని ఏటీఎంలలో రూ.10 వేలు విత్‌డ్రా చేస్తే వారు వసూలు చేసే చార్జీలు రూ.3,108 ఉంటాయి.

## వచ్చే 3 త్రైమాసికాల్లో ఐటీ నియామకాలు అంతంతే



**న్యూఢిల్లీ :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఐటీ రంగం వృద్ధి మందగిస్తుందని, దీంతో వచ్చే మూడు త్రైమాసికాల్లో ఈ కంపెనీల్లో నియామకాలు అంతంతమాత్రంగానే ఉంటాయని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తెలిపింది. 2023-24లో ఐటీ రంగం వృద్ధి 3-5 శాతానికి పరిమితమవుతుందని, 2024-25లో 6 శాతానికి పెరుగుతుందని అంచనా వేసింది. ఐటీ పరిశ్రమ 2022-23లో 9.2 శాతం వృద్ధిచెందింది. ఐటీ సేవలకు డిమాండ్ బలహీనంగా ఉన్నందున, ప్రస్తుత సిబ్బంది నుంచే గరిష్ఠ ఉత్పాదకతను రాబట్టుకోవడంలో కంపెనీలు దృష్టిపెడతాయని పేర్కొంది. ఐటీ రంగానికి పెద్ద మార్కెట్లయిన యూఎస్, యూరప్‌లు స్థూలఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నాయన్నది. దేశీయ ఐటీ రంగానికి 60 శాతం ఆదాయాన్ని ఇచ్చే యూఎస్‌లో ఇటీవలి త్రైమాసికాల్లో డిమాండ్ నెమ్మదిస్తున్నదని తెలిపింది. యూఎస్‌కంటే యూరప్ మార్కెట్ కాస్త స్థిరంగా ఉన్నప్పటికీ, అక్కడ కూడా వృద్ధి పరిమితంగానే ఉంటున్నదని వెల్లడించింది. ఐటీ పరిశ్రమలో ఉద్యోగుల వలసలు గత ఏడాది మూడో త్రైమాసికం నుంచి తగ్గుతున్నాయని ఇక్రా తెలిపింది. 2020-21 నాల్గవ త్రైమాసికం నుంచి 2022-23 రెండవ త్రైమాసికం వరకూ వలసలు విపరీతంగా పెరిగాయన్నది. ఈ నేపథ్యంలో గతంలో నియామకాలు జోరుగా జరిపిందున, ఆయా కంపెనీల వేతన బిల్లులు పెరిగి, ఆపరేటింగ్ లాభాల మార్జిన్లపై ప్రభావం పడుతున్నదని వివరించింది.

## అత్యంత తక్కువ ధరలో ఈ మారుతి కారు



కారు కొనాలని ప్రతి ఒక్కరికి ఉంటుంది. కానీ ఆఫీసు అవసరాలతో పాటు కుటుంబ సభ్యులు విహార యాత్రలు చేయడానికి సౌకర్యంగా ఉండే వాహనాలపై ఎక్కువగా దృష్టి పెడుతూ ఉంటారు.అయితే చిన్న ఫ్యామిలీ అయితేపెద్ద కారును తీసుకొని ప్రయోజనం ఉండదు. అయితే చిన్న కారు కొనాలనుకునేవారు మైలేజ్ తో పాటు లో బడ్జెట్ ఉండాలనుకుంటారు. ఈ క్రమంలో కొన్ని కంపెనీలు రూ.5 లక్షల లోపు కార్లను అందిస్తున్నాయి. ఆ కారు వివరాల్లోకి వెళితే.. దేశంలో అత్యధిక కార్లను విక్రయిస్తోంది మారుతి సుజుకీ కంపెనీ. దీని నుంచి రిలీజ్ అయిన్న కార్లు అన్ని వర్గాలను ఆకట్టుకుంటున్నాయి. మారుతి నుంచి మార్కెట్లోకి వచ్చిన ఆల్టో కే 10 పెట్రోల్ తో పాటు సీఎన్ జీ వేరియంట్ లో లభిస్తోంది. ఆల్టో కే 10 లీటర్ డ్యూయెల్ జెట్ ఇంజిన్ కలిగిన ఇందులో 67 బీహెచ్ పీ పవర్, 89 ఎన్ఎం టార్క్ ను ఉత్పత్తి చేస్తుంది. 5 స్పీడ్ మాన్యువల్, 5 స్పీడ్ ఏఎంటీ గేర్ బాక్స్ ను కలిగిన ఈ కారు రూ.3.99 లక్షల నుంచి ప్రారంభ ధరను కలిగి ఉంది. ఆల్టో కే 10 మొత్తం నాలుగు వేరియంట్లలో లభిస్తోంది. ఇది సీఎన్ జీ వేరియంట్ లో 57 బీహెచ్ పీ పవర్, 82 ఎన్ ఎం టార్క్ ను ఉత్పత్తి చేస్తుంది. ఇందలో 5 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్ గేర్ బాక్స్ మాత్రమే కలిగి ఉంది. చిన్న ఫ్యామిలీకి తక్కువ ధరలో కారు కొనాలనుకునే వారికి ఇది సౌకర్యంటా ఉంటుంది. ఇందులో 7 అంగుళాల టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్మెంట్ సిస్టమ్, కీ లెస్ ఎంట్రీ, డిజిటల్ ఇనిస్ట్రిమెంట్ క్లస్టర్, స్టీరింగ్ మౌంటెడ్, మాన్యువల్ గా సర్దుబాటు చేయగల ఫీచర్లు ఉన్నాయి.

## ఫైర్‌సైడ్ వెంచర్స్, మల్టిప్లై వెంచర్స్ నుండి సిరీస్ ఏ నిధులను పొందిన ఇలువియా



ప్రధాన కార్యాలయాన్ని కలిగి ఉన్న రెనౌరా వెల్‌నెస్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహణలోని ఒక ప్రొఫెషనల్ హెయిర్‌కేర్ బ్రాండ్, ఇలువియా ఇప్పుడు ఫైర్‌సైడ్ వెంచర్స్, మల్టిప్లై వెంచర్స్ నుండి సిరీస్ ఏ నిధులను పొందింది. ఈ పెట్టుబడి సంస్థకు కీలకమైన మైలురాయిని సూచిస్తుంది. ఈసందర్భంగా రెనౌరా వెల్‌నెస్ ప్రైవేట్ లిమిటెడ్ సహ వ్యవస్థాపకులు నిషాంత్ గుప్తా, పలాష్ పాండే మాట్లాడుతూ.. ఈ పెట్టుబడి తమ లక్ష్యాన్ని ధృవీకరిస్తుందన్నారు. ప్రొఫెషనల్ హెయిర్‌కేర్ పరిశ్రమలో విప్లవాత్మకమైన తమ లక్ష్యంకు తోడ్పాటునిస్తుందన్నారు. ఈ నిధులతో నిపుణులు, వినియోగదారుల కోసం వినూత్నమైన, ప్రత్యేకమైన పరిష్కారాలతో తమ ఉత్పత్తి ఆఫర్‌లను మరింత విస్తరింపజేసేటప్పుడు తమ ఆర్ అండ్ డీ పెట్టుబడులను పెంచడానికి తమకు తోడ్పడుతుందన్నారు. ఫైర్‌సైడ్ వెంచర్స్ సహ వ్యవస్థాపకుడు, భాగస్వామి దీపంజన్ బసు మాట్లాడుతూ.. ఇలువియాలో తమ పెట్టుబడి ప్రతిష్టాత్మక, వినూత్నమైన వినియోగదారు బ్రాండ్‌లను నిర్మించడంలో తమ నిబద్ధతకు నిదర్శనమన్నారు. సైన్స్‌పై బ్రాండ్ ఆధారపడటం, వారి ఖచ్చితమైన ఆర్ అండ్ డీ ప్రక్రియ కారణంగా వారు వ్యక్తిగత సంరక్షణలో గొప్ప ఆవిష్కర్తలుగా కనిపిస్తున్నారన్నారు.

## చైనా స్మార్ట్ ఫోన్ కంపెనీలకు ఢిల్లీ హైకోర్టు భారీ షాక్...!



భారత్ లో చైనా స్మార్ట్ ఫోన్ తయారీ సంస్థలకు భారీ షాక్ తగిలింది. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థ ఇంటర్‌డిజిటల్‌కు పెండింగ్‌లో ఉన్న మొత్తం రాయల్టీలను మూడు నెలల్లో చెల్లించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.లేని పక్షంలో సదరు చైనా సంస్థల ఫోన్ అమ్మకుండా కోర్టను ఆశ్రయించొచ్చని తెలిపింది.ఫిబ్రవరి 21న జారీ చేసిన ఢిల్లీ హైకోర్ట్ ఉత్తర్వుల్లో.. ఒప్పో ఇంటర్‌డిజిటల్‌కు సంబంధిత మొత్తాన్ని చెల్లించాలి. లేదంటే కోర్టు ఆదేశాల్ని భేఖాతరు చేసినందుకు భారత్లో ఒప్పోతో పాటు ఇతర చైనా ఫోన్ లు అమ్మకాలు జరగకుండా ఇంటర్ డిజిటల్ కోర్టులో ఇంజక్షన్ ఆర్డర్ కోసం నమోదు చేసుకునేందుకు అర్హత ఉందని సూచించింది. స్మార్ట్ ఫోన్ కంపెనీలు ఇంటర్ డిజిటల్ సంస్థకు ఎంత మొత్తంలో చెల్లించాల్సి ఉందనే అంశంపై స్పష్టతలేదు. అయితే ఆమొత్తాన్ని, అందుకు అయ్యే వడ్డీని బ్యాంక్ అకౌంట్ లలో జమచేయాలని, ఈ కేసు విచారణను 2024 చివరి నాటికి పూర్తి చేయాలని కూడా స్పష్టం చేసింది. తమ హ్యాండ్‌సెట్‌లలో సెల్యులార్ టెక్నాలజీ (3జీ, 4జీ,5జీ), వీడియో కోడింగ్ టెక్నాలజీ వినియోగంపై ఒప్పో,రియల్ మీ, వన్ ప్లస్ బ్రాండ్‌లకు వ్యతిరేకంగా ఇంటర్ డిజిటల్ కోర్టును ఆశ్రయించింది. కోర్టు తీర్పు ప్రకారం.. ఇంటర్‌డిజిటల్ తన సాంకేతికతను ఉపయోగించడం కోసం న్యాయమైన, సహేతుకమైన, వివక్షత లేని నిబంధనలపై లైసెన్స్ ఒప్పందం కోసం ఒప్పో గ్రూప్‌తో కొన్ని సంవత్సరాలుగా చర్చలు జరుపుతోంది. చర్చలు విఫలం కావడంతో డిసెంబర్ 2021లో యూకే, జర్మనీ, భారత్ తో పాటు ఇతర దేశాల్లో స్మార్ట్ ఫోన్ కంపెనీలకు వ్యతిరేకంగా వాజ్యం దాఖలు చేసింది. ఆ కేసుకు సంబంధించి ఢిల్లీ హైకోర్టు తాజాగా తన తీర్పును వెలువరించింది. జూలై 2023లో ఢిల్లీ హైకోర్టు ద్విసభ్య బెంచ్ మొబైల్ ఫోన్ తయారీదారు ఒప్పో తన ఫోన్‌లలో నోకియా సాంకేతికతను అవసరమైన అనుమతి లేకుండా ఉపయోగించినందుకు, నాలుగు వారాల్లోగా దాని భారతదేశ విక్రయాలలో 23 శాతం డిపాజిట్ చేయాలని ఆదేశించింది. ఢిల్లీ హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టు సైతం సమర్ధించింది. కోర్టు తీర్పుతో దిగివచ్చిన ఒప్పో.. నోకియాకు చెల్లించింది.

## 10 వేలకే రెడ్‌మీ 5జీ ఫోన్..

## రెడ్‌మీ 13సీ ఫీచర్లు ఇవే.....!



చైనా మొబైల్ తయారీ సంస్థ రెడ్‌మీ తన 'సీ' సిరీస్‌లో రెండు కొత్త స్మార్ట్‌ఫోన్ల ను భారత మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. రెడ్‌మీ 13సీ , రెడ్‌మీ 13సీ 5జీ పేరుతో రెండు ఫోన్లను విడుదల చేసింది. 4జీ, 5జీ వేరియంట్లలో ఈ ఫోన్లను తీసుకొచ్చింది. 5,000% బ్యాటరీ, ట్రిపుల్ కెమెరాతో ఈ ఫోన్లు వస్తున్నాయి. ఫోన్ల ఫీచర్లు, ధర వివరాలు ఇవీ.. రెడ్‌మీ 13సీ 5జీ మూడు వేరియంట్లలో లభిస్తుంది.

లాంచింగ్ ప్రైస్‌లో (బ్యాంక్ ఆఫర్‌తో కలుపుకొని) భాగంగా బేస్ వేరియంట్ 4జీబీం 128జీబీ ధర రూ.9,999గా కంపెనీ నిర్ణయించింది. 6జీబీం128జీబీ వేరియంట్ ధర రూ.11,499గా కంపెనీ నిర్ణయించింది. ఇక 8జీబీం256 జీబీ వేరియంట్ ధర రూ.13,499గా పేర్కొంది. స్టార్‌ట్రైల్ బ్లాక్, స్టార్‌ట్రైల్ సిల్వర్, స్టార్‌ట్రైల్ గ్రీన్ రంగుల్లో ఈ ఫోన్ లభిస్తుంది.

రెడ్‌మీ 13సీకూడా మూడు వేరియంట్లలో లభిస్తుంది. 4జీబీం128జీబీ వేరియంట్ ధర రూ.7,999గా కంపెనీ నిర్ణయించింది. 6జీబీం128జీబీ వేరియంట్ ధర రూ.8,999 కాగా.. 8జీబీం256జీబీ వేరియంట్ ధర రూ.10,499గా రెడ్‌మీ పేర్కొంది.

## శాటిలైట్ తయారీకి ఊతం...!



**న్యూఢిల్లీ :** అంతరిక్ష రంగం కోసం కేంద్ర ప్రభుత్వం సరళతరం చేసిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) నిబంధనలు.. శాటిలైట్ల తయారీకి ఊతమి వ్వగల వని నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా స్టార్టప్ ఎకోసిస్టమ్‌కు ఇవి కలిసిరాగలవని అభిప్రాయపడుతున్నారు. స్పేస్ రంగంలోని భారతీయ సంస్థలు.. అంతర్జాతీయ కంపెనీలతో జట్టు కట్టేందుకూ మార్గం సుగమమైందని, ఇక నూతన ఆవిష్కరణలు పుంజుకోగలవన్న ఆశాభావాన్నీ వ్యక్తం చేస్తున్నారు. శాటిలైట్ల కోసం విడిభాగాల తయారీలో 100 శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతిస్తూ బుధవారం కేంద్రం ఎఫ్‌డీఐ నిబంధనల్ని సవరించింది. ఈ రంగంలో విదేశీ సంస్థల్ని, ప్రైవేట్ కంపెనీల్ని ఆకర్షించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నది. కాగా, ఈ మేరకు విడుదలైన అధికారిక ప్రకటన ప్రకారం శాటిలైట్ ఉప రంగాన్ని మూడు విభిన్న కార్యకలాపాలుగా విభజించారు. ఒక్కో రంగంలో విదేశీ పెట్టుబడి కోసం పరిమితులతో కూడిన నిర్వచనాల్నీ చెప్పారు. అయితే అంతరిక్ష రంగంలో శాటిలైట్ తయారీకి సంబంధించి 100 శాతం ఎఫ్‌డీఐని అనుమతించినా.. ప్రభుత్వం సూచించిన మార్గంలోనే కార్యకలాపాలు సాగాలి. ఈ క్రమంలోనే శాటిలైట్ తయారీ, ఆపరేషన్, శాటిలైట్ డాటా ప్రొడక్ట్స్, గ్రౌండ్, యూజర్ సెగ్మెంట్లలోకి ఆటోమేటిక్ మార్గంలో 74 శాతం వరకు ఎఫ్‌డీఐకి అనుమతి ఉన్నది. ఈ పరిమితి దాటితే ప్రభుత్వ ఆమోదం తప్పనిసరి. ఇక లాంచ్ వెహికిల్స్, అసోసియేటెడ్ సిస్టమ్స్ లేదా సబ్‌సిస్టమ్స్, స్పేస్‌క్రాఫ్ట్ రాకపోకల కోసం స్పేస్‌పోర్ట్స్ నిర్మాణానికి ఆటోమేటిక్ మార్గంలో 49 శాతం వరకు ఎఫ్‌డీఐని అనుమతి స్తున్నారు. అంతకుమించితే ప్రభుత్వ అంగీకారం కావాల్సిందే. ఇంకా విడిభాగాల తయారీ, శాటిలైట్ల కోసం సిస్టమ్స్/సబ్‌సిస్టమ్స్, గ్రౌండ్, యూజర్స్ సెగ్మెంట్స్‌కు ఆటోమేటిక్ మార్గంలో 100 శాతం వరకు విదేశీ పెట్టుబడులను అనుమతిస్తున్నారు. 'ఈ కొత్త విధానం.. లాంచ్ వెహికిల్స్, శాటిలైట్ల తయారీ, అసెంబ్లింగ్ కోసం మన స్టార్టప్ ఎకోసిస్టమ్‌కు తప్పక సహాయపడుతుంది' అని డెలాయిట్ భాగస్వామి శ్రీరామ్ అనంతశయనం అన్నారు. ఇక విదేశీ సంస్థలతో కలిసి ముందుకెళ్లే అవకాశం భారతీయ సంస్థలకు లభిస్తుందని నంగియా అండర్సన్ ఇండియా రెగ్యులేటరీ డైరెక్టర్ మయాంక్ అరోరా అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం భారతీయ అంతరిక్ష రంగంలో 200లకుపైగా స్టార్టప్‌లున్నాయని అంచనా.

## పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తున్నారా.. ఈ విషయాలు తప్పక తెలుసుకోవాల్సిందే.......!

ప్రతి ఒక్కరూ తమ ఆదాయంలో తమ పిల్లలు, కుటుంబ భవిష్యత్ అవసరాల కోసం కొంత మొత్తం పొదుపు చేస్తుంటారు. అత్యధికులు రిస్క్ లేని రిటర్న్ ఇచ్చే మదుపు మార్గాల వైపు మొగ్గు చూపుతుంటారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాలంటే పోస్టాఫీసు ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాలే ఫేమస్.. కానీ వీటిల్లో మదుపు చేసిన మొత్తం.. మెచ్యూరిటీ తేదీ వచ్చే వరకూ విత్ డ్రాయల్ చేయడానికి వీల్లేదు.. కేంద్ర ఆర్థిక శాఖ కూడా తాజాగా పోస్టాఫీసు ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాల నుంచి మనీ విత్ డ్రాయల్ నిబంధనలను సడలించింది.

ఈ మేరకు గత నెల ఏడో తేదీన నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం ఐదేండ్ల గడువు గల పోస్టాఫీసు ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాల్లో మదుపు చేసిన మొత్తం ముందస్తు విత్ డ్రాయల్ కోసం నాలుగేండ్లు ఆగాల్సిందే.

గత నెల తొమ్మిదో తేదీ వరకు ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాల్లో మదుపు చేసిన మొత్తాల ముందస్తు విత్ డ్రాయల్స్ కోసం పాత నిబంధనలు వర్తిస్తాయి. కానీ, గత నెల 10 తర్వాత ఐదేండ్ల ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాల్లో మదుపు చేసిన మొత్తాల విత్ డ్రాయల్




నిబంధనలను సవరించారు. అవేమిటంటే..డిపాజిట్ చేసిన తేదీ నుంచి ఆరు నెలల్లోపు ఏ ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకం నుంచి విత్ డ్రాయల్ చేయడానికి అనుమతించరు. ఐదేండ్ల గడువు గల పోస్టాఫీసు ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకం నుంచి నాలుగేండ్ల లోపు విత్ డ్రాయల్ చేయడానికి నిబంధన అనుమతించరు. ఏడాది, రెండేండ్లు, మూడేండ్ల గడువు గల ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఆరు నెలల తర్వాత విత్ డ్రా చేయొచ్చు.

## వ్యవసాయరంగాన్ని కార్పోరేట్ కంపెనీలకు

# కట్టబెట్టే కుట్రలు

హైదరాబాద్: దేశ వ్యవసాయరంగాన్ని కార్పోరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు మోడి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని సంయుక్త కిసాన్ మోర్చా ఆరోపించింది. ప్రపంచ వాణిజ్య సంస్థ నుండి భారత్ బయటకు రావాలని డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కిసాన్‌మోర్చా అధ్వర్యంలో సోమవారం , కార్మిక, ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు సుందరయ్య పార్కు నుండి ఆర్ టి సి క్రాస్ రోడ్ వరకు వాహన ర్యాలీ నిర్వహించారు.అనంతరం కిసాన్ సంయుక్త మోర్చా రాష్ట్ర కన్వీనర్ లు టి సాగర్ మాట్లాడుతూ... డబ్ల్యూటీవో నుండి భారతదేశం బయటకు రావాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని విదేశీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు పూనుకుంటున్నదని అన్నారు.



ఫిబ్రవరి 26న అబుదాబీలో కాన్ఫరెన్స్ ప్రారంభం కానుందని, వ్యవసాయరంగంలో రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరలను నిమంజూరు చేయకుండా భారత ప్రభుత్వాన్ని బలవంతం చేయడంతో పాటు రైతులకు ఇస్తున్న సబ్సిడీలు తగ్గించాలని డబ్యుటివో ఒత్తిడి చేస్తున్నదని అన్నారు. ప్రజలకు నేరుగా డబ్బులు బదిలీ చేయాలని ఒత్తిడి చేయడం ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థను ఉపసంహరించుకోవడానికి డబ్యుటివో ఒత్తిడి చేస్తున్నదని,ఈ ప్రతిపాదనలు రైతులకు, పేద ప్రజలకు, ఆహార భద్రతకు భారతదేశ సార్వభౌమత్వానికి హానికరం అని అన్నారు. డబ్యుటిఓను దేశం నుండి తరమాలని పిలుపునిచ్చారు. రైతుల పోరాటం పై నిర్భందానికి వ్యతిరేకంగా దేశం అంతటా రైతులను చైతన్యవంతం చేయాలని కోరారు. ఢిల్లీ సరిహద్దు ప్రాంతంలో రైతుల నిరసన స్థలంలో రైతుల ట్రాక్టర్లను పోలీసులు ధ్వంసం చేశారన్నారు. రైతులపై అణచివేత ప్రయోగించడం, రైతు ఉద్యమాన్ని ఏకాకిని చేసి విభజించేందుకు కుట్ర పన్నారని, ఈ విభజనతో ఎన్నికల ప్రయోజనం పొందేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. అలాగే మృతుల కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని, పాడైన ట్రాక్టర్ల మరమ్మతు ఖర్చులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ,గ్రామాన పాదయాత్రలు నిర్వహించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం దిగి రాకపోతే మార్చి 14న ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో జరిగే ఆందోళనలో పార్టీలకతీతంగా రైతులు, ప్రజలు భాగస్వాములు కావాలని సాగర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సోమన్న,కిషన్ (సీఐటీయూ), యం.హన్మేష్ (ఐ ఎఫ్ టి యు),మూడ్ శోభన్ ( రైతు సంఘం), బుర్రి ప్రసాద్, బొప్పని పద్మ( వ్యవసాయ కార్మిక సంఘం), ఆర్. శ్రీరామ్ నాయక్, యం. ధర్మా నాయక్ ( గిరిజన సంఘం), స్వరూప, వరలక్ష్మి, లక్ష్మి బాయి,పుష్ప(పిఓడబ్ల్యు)కోట రమేష్,జావెద్ (డివైఎఫ్ ఐ), కెయస్ ప్రదీప్ (పివైఎల్),తాళ్ళ నాగరాజు, అశోక్ రెడ్డి,లెనిన్ గువేరా (ఎస్ఎఫ్ఐ) యస్ నాగేశ్వరావు, మహేష్, అనిల్ (పిడియస్ యు) తదితరులు పాల్గొన్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో రూ. 8 లక్షల రివార్డున్న నక్సల్ కమాండర్ లొంగుబాటు

సుక్మా : ప్రాణాంతకమైన దాడుల్లో పాల్గొన్నట్టు ఆరోపణలున్న నక్సలైట్ కమాండర్ నగేష్ అలియాస్ పెడకం ఎర్ర (38) ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలో సోమవారం పోలీస్‌లు, భద్రతాదళాల ముందు లొంగిపోయాడు. ఆయన తలపై రూ.8 లక్షల రివార్డు ఉంది. నక్సల్స్ అమానవీయ, శుష్క మావోయిస్టు భావజాలానికి విసిగిపోయి తనంతట తానే పోలీస్‌ల ఎదుట లొంగిపోయాడని సుక్మా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కిరణ్ జి చావన్ వెల్లడించారు. జిల్లా పోలీస్‌ల పునరావాస ఉద్యమానికి ప్రభావితమైనట్లు ఎర్ర చెప్పాడు. నక్సల్స్ స్థానిక దళం ( ఎల్ఓఎస్ )లో 2003లో ఎర్ర చేరాడు. 2015లో నక్సల్స్ కంపెనీ కమాండర్ ఆఫ్ పిఎల్‌జిఎ బెటాలియన్ నెం.1 గా ఎదిగాడు. 2010లో తాడ్‌మెట్ల సామూహిక మారణ కాండతోపాటు అనేక ప్రాణాంతక దాడుల్లో పాల్గొన్నాడు. తాడ్‌మెట్ల మారణకాండలో 76 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. 2017 బుర్కపాల్ దాడిలో 25 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లు బలయ్యారు. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన లొంగుబాటు, పునరావాస పథకం కింద ఎర్రకు అన్ని సౌకర్యాలు కల్పిస్తారు. గత



ఏడాది ప్రారంభమైన పునరావాస పథకం కింద ఈ జిల్లాలో ఇప్పటివరకు 176 నక్సలైట్లు లొంగిపోయారు.

# మహిళా నక్సలైట్ అరెస్ట్



గడ్చిరోలి ( మహారాష్ట్ర): భద్రతాదళాలపై దాడుల్లో ప్రమేయం ఉన్న మహిళా నక్సలైట్ రాజేశ్వరి అలియాస్ కమలా పద్గా గోటా (30) ను మహారాష్ట్రఛత్తీస్‌గఢ్ సరిహద్దు గచ్చిరోలిలో ఆదివారం పోలీస్‌లు అరెస్ట్ చేశారు. ఆమె తలపై రూ.6 లక్షల రివార్డు ఉందని పోలీస్‌లు చెప్పారు. 2023 ఏప్రిల్‌లో భ్రమగడ్‌లో కేద్మర అటవీ ప్రాంతంలో పోలీస్‌లకు, మావోయిస్టులకు మధ్య జరిగిన పోరులో గోటా ప్రమేయం ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ లోని కచలారం అటవీ ప్రాంతంలో పోలీస్ దళాలపై కాల్పులకు పాల్పడిన సంఘటన జరిగింది. ఇవే కాకుండా ఇతర హింసాత్మక సంఘటనల్లో పద్గా ప్రమేయం ఉంది. 2019లో అరెస్ట్ అయిన సంవత్సరం తరువాత విడుదలైంది. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ నేతృత్వంలో టైలరింగ్ టీమ్‌లో ఏరియా కమిటీ మెంబర్‌గా ఆమె ఉంటోంది. ఎస్‌పి నీలోత్పల్ మార్గదర్శకత్వంలో గచ్చిరోలి పోలీస్‌లు గత ఏడాది జనవరి నుంచి విస్తృతంగా గాలింపు చేపట్టి కరడుగట్టిన 73 మావోయిస్టులను అరెస్ట్ చేయడమైందని పోలీస్‌లు ఒక ప్రకటనలో తెలిపారు.

# 7 రోజుల్లో షాజహాన్ అరెస్టు: టిఎంసి

కోల్‌కత: పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖలీలో మహిళలపై అత్యాచారాలు, భూ కబ్జాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పార్టీ నాయకుడు షాజహాన్ షేక్‌ను ఏడు రోజుల్లోగా అరెస్టు చేస్తామని అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ(టిఎంసి) సీనియర్ నాయకుడు కునాల్ హెూష్ సోమవారం ప్రకటించారు. షాజహాన్ అరెస్టుపై ఎటువంటి స్టే లేదని కలకత్తా హైకోర్టు స్పష్టం చేసిన తర్వాత కునాల్ ఘోష్ నుంచి వెంటనే ఈ ప్రకటన వెలువడడం గమనార్హం. షాజహాన్ అరెస్టుపై పార్టీ ఎంపి అభిషేక్ బెనర్జీ చెప్పిందే సరైనదని ఘోష్ తెలిపారు. ఈ అంశం కోర్టు పరిధిలో చిక్కుకుని ఉందని, దీన్ని అవకాశంగా తీసుకుని బిజెపి రాజకీయాలు చేస్తోందని ఆయన అన్నారు.



# కాంగ్రెస్ మోసపూరిత హామీలు నమ్మొద్దు : ఈటల



జ్వేల్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని, ఇచ్చిన హామీల్లో ఒక్క బస్సు ప్రయాణం తప్ప ఏదీ అమలు కాలేదని, కనుక ప్రజలు మోసపు హామీలు నమ్మొద్దని బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ మంత్రి ఈటల రాజేందర్ కోరారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో పార్టీ విజయ సంకల్ప యాత్ర సందర్భంగా సోమవారం గజ్వేల్ పట్టణ కేంద్రంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తమ పార్టీ రాష్ట్రంలోని 17 సీట్లలో పోటీ చేసి 10కి పైగా పార్లమెంట్ స్థానాలు గెలవాలని భావిస్తోందని అన్నారు. . నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా ఈ నెల 20వ తేదీ నుంచి 5 క్లస్టర్లలో విజయ సంకల్ప యాత్ర చేస్తున్నామని తెలిపారు.

జహీరాబాద్, కరీంనగర్, చేవెళ్ల, మెదక్ పార్లమెంట్ స్థానాల్లో యాత్ర కొనసాగుతుందని అన్నారు. గజ్వేల్‌లో ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చారని, గెలవగానే లక్ష రూపాయలు అదనంగా భూ బాధితులకు ఇస్తాం.. 18 సంవత్సరాల వయసు పైన భూములు కోల్పోయిన వారికి రూ.5 లక్షలు ఇస్తామని చెప్పారని అన్నారు. ఇళ్లకు పట్టాలు ఇస్తాం, ఇళ్లు కట్టిస్తామని ఓట్లు డబ్బాల పడే వరకు హామీలు ఇచ్చి.. ఇప్పుడు వాటి ఊసే ఎత్తడం లేదని ఎద్దేవా చేశారు. కేసిఆర్ ఎన్నికల్లో ఓడిపోవచ్చు కానీ ఇవన్నీ వాస్తవ డిమాండ్స్ కాబట్టి వాటిని నెరవేర్చాలని తానే ఈ ప్రభుత్వానికి దరఖాస్తు ఇస్తానని తెలిపారు. మొన్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కి ఓటు వేశాం కానీ ఈసారి జెండాలు లేవు మోడీకే వేస్తాం అని జనం చెపుతున్నారని అన్నారు. దేశంలో సుభిక్షంగా, సురక్షితంగా బతకాలి అనేది మోడీ సంకల్పం అని అన్నారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉంటే అనేక అక్రమాలు జరిగాయని, 2జి స్పెక్ట్రమ్ స్కాం, కోల్ మైన్ స్కాం, ఫర్టిలైజర్ స్కాం ఇలా అనేక స్కామ్‌లలో మంత్రులు, ఐఏఎస్ అధికారులు అరెస్టయి జైలులో ఉన్నారని తెలిపారు. ప్రధాని మోడీ హయాంలో ఎక్కడా ఒక్క స్కామ్ కూడా లేదని అన్నారు. 370 రద్దు, రామాలయ నిర్మాణం, మైనార్టీ మహిళలకు వరమైన ట్రిపుల్ తలాక్ రద్దులాంటి ఎన్నో చారిత్రకమైన నిర్ణయాలు ప్రజలకు తెలియనివి కావన్నారు. సబ్ కా సాత్ సబ్ కా విశ్వాస్ సబ్ కా ప్రయాస్‌ను తు.చ తప్పకుండా ప్రధాని మోడీ అమలు చేస్తున్నారని కొనియాడారు. అందుకే మోడీకి దేశంలో అన్ని వర్గాల,రకాల ప్రజలు మద్దతు తెలుపుతున్నారని అన్నారు. బిఆర్ఎస్ ఖతమైన పార్టీ అని, ఈసారి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి బిజెపిని భారీ మెజార్టీతో గెలిపించి నరేంద్ర మోడీని ముచ్చటగా మూడోసారి ప్రధానమంత్రిని చేయాలని ప్రజలను కోరారు.

# పాక్ పంజాబ్ సిఎంగా నవాజ్ కుమార్తె మరియం

లాహెూర్ : పాకిస్తాన్ ముస్లిం లీగ్‌నవాజ్ (పిఎంఎల్ఎన్) సీనియర్ నాయకురాలు, మూడు సార్లు ప్రధాని నవాజ్ షరీఫ్ కుమార్తె మరియం నవాజ్ పాకిస్తాన్‌లో ఒక ప్రావిన్స్‌కు తొలి మహిళా ముఖ్యమంత్రి అయ్యారు. ఆమె పంజాబ్ ప్రావిన్స్ ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. దేశంలో ప్రతి మహిళకు ఇది 'గర్వకారణం' అని ఆమె పేర్కొన్నారు. మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ పార్టీ మద్దతు ఉన్న సున్నీ ఇత్తేహాద్ కౌన్సిల్ (ఎస్ఐసి) శాసనసభ్యుల వాకౌట్ మధ్య ముఖ్యమంత్రి ఎన్నికలలో పిఎంఎల్–ఎన్ సీనియర్ ఉపాధ్యక్షురాలు 50 ఏళ్ల మరియం నవాజ్ గెలుపొందారు. ప్రావిన్షియల్ శాసనసభలో తన తొలి ప్రసంగంలో మరియం భగవంతునికి, తన తండ్రి నవాజ్ షరీఫ్‌కు, బాబాయి షెహ్‌బాజ్ షరీఫ్‌కు, తనకు వోటు వేసిన శాసనసభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. తన తండ్రి కూర్చుంటుండే స్థానంలో ఆసీనురాలు అయినందుకు తాను సంతోషిస్తున్నానని మరియం తెలిపారు. 'పదవీ బాధ్యతల నిర్వహణ ఏవిధంగానో నా తండ్రి నాకు నేర్పారు' అని నవాజ్ షరీఫ్‌కు రాజకీయ వారసురాలిగా పరిగణిస్తున్న మరియం చెప్పారు. 'ఇప్పుడు ఒక మహిళా ముఖ్యమంత్రిని చూస్తున్నందుకు ప్రావిన్స్‌లో ప్రతి మహిళ గర్విస్తుంటుంది' అని ఆమె అన్నారు. మహిళా నాయకత్వ సంప్రదాయం ముమ్ముందు కూడా కొనసాగుతుందనే ఆశాభావాన్ని మరియం వ్యక్తం చేశారు. కారాగార శిక్ష వంటి కఠిన సమయాలను తాను చూసినట్లు ఆమె చెప్పారు. అయితే, తనను బలమైన నాయకురాలిని చేసినందుకు ప్రత్యర్థులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. 'నేను కక్ష తీర్చుకోవాలని అనుకోవడం లేదు' అని మరియం



పాక్ సైనిక దళాల మాజీ అధిపతి జనరల్ కమర్ జావేద్ బజ్వా, పాకిస్తాన్ మాజీ ప్రధాన న్యాయమూర్తి సకీబ్ నిసార్‌లను పరోక్షంగా ప్రస్తావిస్తూ చెప్పారు. రాజకీయంగా కీలకమైన, 12 కోట్ల జనాభా ఉన్న పంజాబ్ ప్రావిన్స్ ముఖ్యమంత్రి పదవికి నిర్వహించిన ఎన్నికలలో మరియం నవాజ్ 220 వోట్లతో గెలిచారు. పిటిఐ మద్దతు ఉన్న ఎస్ఐసి అభ్యర్థి రాణా అఫ్తాబ్‌ను ఆమె ఓడించారు. ఎస్ఐసి ఎన్నికలను బహిష్కరించినందున ఆయనకు ఒక్క వోటూ రాలేదు. కొత్తగా ఎన్నికైన స్పీకర్ మాలిక్ అహ్మద్ ఖాన్ సెషన్‌కు అధ్యక్షత వహిస్తూ, 'వోట్లను లెక్కించడమైంది. మరియంకు 220 వోట్లు లభించాయి. ఎస్ఐసి అభ్యర్థి రాణా అఫ్తాబ్ అహ్మద్‌కు సున్నా వోట్లు వచ్చాయి' అని తెలియజేశారు.

# బట్టలు ఆరవేస్తుండగా విద్యుత్ షాక్.. భార్యాభర్తలు మృతి

దౌల్తాబాద్: ఉతికిన బట్టలు ఆరవేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై భార్యాభర్తలు మృతి చెందిన విషాదకర సంఘటన వికారాబాద్ జిల్లా, బొంరాస్‌పేట్ మండల పరిధిలోని బురాన్‌పూర్‌లో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే%ౌ%బురాన్‌పూర్ గ్రామానికి చెందిన బోయిని లక్ష్మణ్ (40) బోయిని లక్ష్మి(38) భార్యాభర్తలు. గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. సోమవారం ఉదయం వారి ఇంటి ముందు ఉన్న



ఇనుప తీగపై బట్టలు ఆరవేస్తుండగా లక్ష్మణ్ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీనిని గమనించిన భార్య భర్తను కాపాడాలనే ఆత్రుతలో తాను కూడా విద్యుత్ షాక్‌కు గురైంది. ఈ క్రమంలో వారిద్దరూ అక్కడి కక్కడే మృతి చెందారు. గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని శవ పంచనామా నిర్వహించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పరిగి ఆసుపత్రికి తరలించారు.

# పాకిస్తాన్ కు రావి జలాలు బంద్!

సిందునదికి ఉప నది అయిన రావి నదీజలాలను పాకిస్తాన్ కు ప్రవహించకుండా భారత ప్రభుత్వం కట్టడి చేసింది. ఇరు దేశాల మధ్య 1960లో జరిగిన ఒప్పందం ప్రకారం రావి, బియాస్, సట్లెజ్ నదులు మన దేశానికి, జీలం, చీనాబ్ నదులు పాకిస్తాన్ కు చెందుతాయి. రావి నదీ జలాలను పూర్తిగా భారతదేశమే వాడుకోవచ్చునని ఒప్పందం పేర్కొంటోంది. ప్రపంచ బ్యాంకు సమక్షంలో జరిగిన ఈ ఒప్పందం మేరకు రావి నదిపై ఎగువన రంజిత్ సాగర్ డ్యామ్, దిగువన షాపుర్ కంది బ్యారేజీ నిర్మించేందుకు 1979లో జమ్ముకాశ్మీర్, పంజాబ్ రాష్ట్రాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. రంజిత్ సాగర్ డ్యామ్ 2001లో పూర్తయినా, షాపుర్ కంది ప్రాజెక్టు ఆగిపోయింది. దీనివల్ల పాకిస్తాన్ కు రావి నదీ జలాల ప్రవాహం కొనసాగింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం 2013లో పునఃప్రారంభమై, ఈ మధ్యనే పూర్తయింది. దీంతో ఆదివారంనుంచి రావి జలాలను పాకిస్తాన్ కు ఆపేశారు. ఇంతకాలం పాకిస్తాన్ కు వెళ్లిన రావి జలాలను జమ్ము కాశ్మీర్ లోని కథువా, సాంబా జిల్లాలకు మళ్లిస్తున్నారు. డ్యామ్ లో ఉత్పత్తి అయ్యే విద్యుత్ లో 20 శాతాన్ని జమ్ము కాశ్మీర్ కు ఇస్తారు.



**పాకిస్తాన్‌కు రావి నీటి సరఫరా నిలిపివేత**

షాపూర్ కంది బ్యారేజ్ నిర్మాణం ముగియడంతో పాకిస్తాన్ రావి నది నుంచి నీటి ప్రవాహాన్ని పూర్తిగా నిలిపివేసినట్లు మీడియా వార్తల ద్వారా తెలియవచ్చింది. పంజాబ్, జమ్మూ కాశ్మీర్ సరిహద్దులో షాపూర్ కంది బ్యారేజ్ ఉన్నది. ఈ చర్య వల్ల పాకిస్తాన్‌కు ఇంతకుముందు కేటాయించిన 1150 క్యూసెక్కుల నీరు జమ్మూ కాశ్మీర్ ప్రాంతానికి లభ్యం అవుతుంది. ఈ జలాలను నీటిపారుదల అవసరాలకు వినియోగిస్తారు. కథువా, సాంబా జిల్లాల్లో 32 వేల హెక్టార్ల భూమికి దీని వల్ల ప్రయోజనం కలుగుతుంది. నీటిపారుదలకు, జల విద్యుత్ ఉత్పత్తికి కీలకమైన షాపూర్ కంది బ్యారేజ్ ప్రాజెక్టుకు గత మూడు దశాబ్దాలలో ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. జమ్మూ కాశ్మీర్‌లో వేలాది ఎకరాల వ్యవసాయ భూమికి నీటిపారుదల సౌకర్యం కలిగించే అవకాశం ఉన్నందున షాపూర్ కంది డ్యామ్ ప్రాజెక్టుకు ప్రధాని నరేంద్ర మోడీ అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. గడచిన 40 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న షాపూర్ కంది డ్యామ్ ప్రాజెక్టుపై పనిని తిరిగి ప్రారంభించేందుకు జమ్మూ కాశ్మీర్, పంజాబ్ 2018 సెప్టెంబర్ 8న ఒక ఒప్పందంపై సంతకాలు చేశాయి.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com